




నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

రంగారెడ్డి
వికారాబాద్
మేడ్చల్

బుధవారం 8 అక్టోబర్ 2025 పేజీలు 11


నేడే హైకోర్టులో 42 శాతం

## బీసీ రిజర్వేషన్ల విచారణ

- అందరి చూపు హైకోర్టు పైనే
- అందరిలో తీవ్ర ఉత్కంఠత
- మొన్న సుప్రీం కోర్టు తీర్పు కోసం, నేడు హైకోర్టు తీర్పు కోసం
- ఎన్నికల కోసం సర్వం సిద్ధంగా పెట్టిన సర్కార్
- మరి కొన్ని గంటల్లో తేలిపోనున్న ఉత్కంఠత




తాండూరు, మేజర్ న్యూస్ (అక్టోబర్ 07): లోకల్ బాడీస్ ఎన్నికల వ్యవహారంలో 42 శాతం బీసీలకు సంబంధించిన విచారణ నేడు బుధవారం నాడు హైకోర్టులో ఎదో ఒక్కటి తేటతెల్లం కానుండడంతో అందరి చూపు హైకోర్టు పైననే ఉంది. వారం పది రోజుల నుండి అందరిలో గుబులు పుట్టిస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల వ్యవహారం తీర్పు నేడు హైకోర్టులో బట్టబయలు కానుంది. మిగతా 3లో

# ఆశా...నిరాశేనా...!

- అనుకున్నదొకటి ...అయినది మరొకటి
- నాయకగణంపై స్థానిక రిజర్వేషన్ల పంజా
- లోలోపల కుంగిపోతున్న ఆశావహులు
- ఆ పార్టీ కుంపటి ముంచే విదంగా రిజర్వేషన్లు



షాద్‌నగర్, మేజర్‌న్యూస్ (అక్టోబరు 07): రాజకీయం.. దీంతో సహవాసం చేసిన నేతలు సామాన్యంగా ఆ ఊబిలోనుండి బయటపడరు. అధికారం కోసం ప్రజల మద్య ఉంటూ ఆర్థికంగా వారి తాహత కు తగ్గట్లుగా పలు సేవా కార్యక్రమాలు చేస్తూనే ఉంటారు. ఇదంతా జరుగుతున్న క్రమంలో స్థానికంగా ఐదేళ్లకు ఒకసారి వచ్చే ఎన్నికల్లో నాయకులు పోటీ చేసి తమ నాయకత్వాన్ని పరిశీలించికుంటూ ఉంటారు. ఎన్నికలలో నిలబడి ప్రజా ప్రతినిధిగా కావాలని ఆశపడే వారు ముందుగానే అందుకు త గిన రీతిలో ప్రణాళికలు రూపొందించుకుని తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటుంటారు. అయితే అలాంటి నాయకులకు ఊహించని రీతిలో పోటీ చేసేందుకే అవకాశం లేకుండా ఉండటం అనే అంశం వారికి ఎదురయితే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. స్థానిక ఎన్నికలే టార్గెట్ గా ఇంతకాలం సేవా కార్యక్రమాలు చేస్తూ ఆర్థికంగా ఎంతో ఖర్చు చేసుకోవడంతో పాటుగా ప్రజా ప్రతినిధులుగా ఖచ్చితంగా ఉంటామనే వారి ఆశలు అడియాశలవడం స్థానికంగా చర్చనీయాంశమవుతుంది. మిగతా 2లో

## RRR ఉద్యమం...

### లగచర్ల ఉద్యమాన్ని తలపించాలి....

- RRR రైతులకు అండగా ఉంటాం
- పాత అలైన్మెంట్ ప్రకారం త్రిబుల్ ఆర్ రోడ్డు నిర్మించాలి
- మాజీమంత్రి, ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి
- రైతులు భూములు నమ్ముకుని తుకుతుంటే, రేవంత్ రెడ్డి భూములు అమ్ముకుని బతుకుతున్నాడు..
- వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్- చిట్టిగిద్ద గ్రామంలో RRR బాధిత రైతులకు భరోసా కల్పించిన బిఆర్ఎస్ నేతలు

వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (అక్టోబర్ 07): 5లో



మహిళా రైతులతో మాట్లాడుతున్న సబితా రెడ్డి.

42% బీసి రిజర్వేషన్ల పెంపుకు

## గ్రీన్‌సిగ్నల్ వచ్చేనో..!

- నేడు హైకోర్టులో కొనసాగనున్న బీసి రిజర్వేషన్ల విచారణ పైనే అందరిచూపు
- కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇస్తే..ఎన్నికల సంఘంచే ఈనెల 9న తొలిదశ ఎన్నికలకు నోటిఫికేషన్
- ఇప్పటికి ఖరారైన రిజర్వేషన్లు మాడ్గుల జడ్‌పిటిసి స్థానం బీసి జనరల్‌కు, ఎంపిపి స్థానం జనరల్‌కు రిజర్వ్
- 14 ఎంపిటిసి స్థానాలకు ఎస్సీలకు 3, ఎస్టీలకు 2, బీసిలకు 6, జనరల్‌కు 3 స్థానాల కేటాయింపు
- 34గ్రామపంచాయతిలకు ఎస్సీలకు 6, ఎస్టీలకు10,బీసిలకు 11,జనరల్ కేటగిరికి 7 కేటాయింపు


పాలకవర్గం లేక వెలవెలబోతున్న మాడ్గుల గ్రామపంచాయతి కార్యాలయం

మాడ్గుల, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 07): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసి రిజర్వేషన్లను 42శాతానికి పెంచడాన్ని వ్యతిరేకిస్తూ కొందరు హైకోర్టును ఆశ్రయించగా అందరిచూపు బుధవారం హైకోర్టులో కొనసాగే విచారణపైనే ఉన్నది. 42శాతం బీసి రిజర్వేషన్లకు కోర్టు సమ్మతిస్తుందా లేక ససేమిరా అంటుందా అన్న సందిగ్ధంలో స్థానిక ఎన్నికల బరిలో నిలువాలనుకుంటున్న ఆశావాహులు, రాజకీయపార్టీల నాయకులు , ప్రజలు ఉత్కంఠతతో ఎదురుచూస్తున్నారు. మిగతా 2లో

## విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

జిల్లా వైద్యాధికారి డాక్టర్ కె. లలితాదేవి


డెలివరీ అయిన మహిళను పలకరిస్తున్న డీఎంహెచ్‌వో లలితాదేవి

రంగారెడ్డి, మేజర్ న్యూస్ (అక్టోబర్ 07) : విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కె. లలితాదేవి అన్నారు. సరూర్‌నగర్‌లోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. డెలివరీ అయిన మహిళలను ఆమె పలకించారు. వారి ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను ఆమె పరిశీలించారు. ఈ ఆకస్మిక తనిఖీలో జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ గీత, స్థానిక వైద్యులు అర్చన, తదితరులున్నారు.

## మహర్షి వాల్మీకి స్ఫూర్తి నిత్యనూతనమై నిలవాలి

- కలెక్టర్ మను చౌదరి ... మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు



మేడ్చల్ జిల్లా ప్రతినిధి,మేజర్ న్యూస్ (అక్టోబర్, 07): జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను మంగళవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి జ్యోతి ప్రజ్వలన చేసి, మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మిగతా 3లో

## 42% బీసి రిజర్వేషన్ల పెంపుకు గ్రీన్‌సిగ్నల్ వచ్చేనో..!

**మొదటిపేజీ తరువాయి...** కాగా రాష్ట్ర ప్రభుత్వం బీసి రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతూ తెచ్చిన జీవో 9తో క్షేత్రస్థాయిలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేయగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఈనెల 9న జిల్లాప్రాదేశిక, మండల ప్రాదేశిక స్థానాల ఎన్నికల తొలిదశ పోలింగ్‌కు నోటిఫికేషన్ జారీచేయనుండడంతో పాటు ఇప్పటికే జడ్‌పిటిసి, ఎంపిపి, ఎంపిటిసి, సర్పంచ్‌లు, వార్డుసభ్యుల రిజర్వేషన్లను ప్రకటించింది. ఈ క్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మొదలు ప్రస్తుత రంగారెడ్డి జిల్లా వరకు అత్యధిక గ్రామపంచాయతిలు కలిగిన మాడ్గుల మండలంలో జడ్‌పిటిసి స్థానం బీసి జనరల్‌కు రిజర్వ్ కాగా ఎంపిపి జనరల్‌కు కేటాయిం చబడింది. అదేవిధంగా మండలవ్యాప్తంగా 14 ఎంపిటిసి స్థానాలకు గాను ఎస్సీలకు 3, ఎస్టీలకు 2, బీసిలకు 6, జనరల్‌కు 3 స్థానాల కేటాయించారు. వీటిలో నాగిల్ల, ఇర్విన్ స్థానాలు ఎస్సీ జనరల్‌కు బ్రాహ్మణపల్లి స్థానం ఎస్సీ మహిళకు కేటాయించారు. అదేవిధంగా అప్పారెడ్డిపల్లి ఎస్టీ జనరల్‌కు రిజర్వ్ కాగా ఆర్కపల్లి ఎంపిటిసి స్థానం ఎస్టీ మహిళకు రిజర్వ్ అయ్యింది. అవురుపల్లి, మాడ్గుల-1, కూభ్యతాండ ఎంపిటిసి స్థానాలు బీసి జనరల్‌కు రిజర్వ్ కాగా సుద్ధపల్లి, కొల్కులపల్లి, కలకొండ స్థానాలు బీసి మహిళకు రిజర్వ్ అయ్యాయి. అదేవిధంగా మాడ్గుల-2, గిరికొత్తపల్లి ఎంపిటిసి స్థానాలు జనరల్ కేట గిరికి రిజర్వ్ కాగా కాత్రగానితాండ ఎంపిటిసి స్థానం జనరల్ మహిళకు రిజర్వ్ అయింది. అదేవిధంగా మాడ్గుల మండ లంలోని 34గ్రామపంచాయతిలకుగాను ఎస్సీలకు 6, ఎస్టీలకు10, బీసిలకు 11, జనరల్ కేటగిరికి 7 జిపిలను రిజర్వ్ చేయ బడ్డాయి. వీటిలో అందుగుల, ఇర్విన్, ఫిరోజ్‌నగర్ జి.పిలు ఎస్సీ జనరల్‌కు రిజర్వ్ కాగా అవురుపల్లి, కలకొండ, నల్లజెర్వు జిపిలు ఎస్సీ మహిళకు రిజర్వ్ కాబడ్డాయి. అదేవిధంగా ఎస్టీ జరాభా కలిగిన గ్రామపంచాయతిలతో పాటు నూతనంగా కేటాయించబడ్డ రిజర్వేషన్ల ప్రకారం గుడితాండ, జయరాంతాండ, కాత్రగానితాండ, పకీరతాండ, రాందుగ్యాల జిపిలు ఎస్టీ జనరల్‌కు, జర్పులతాండ, కొర్రతాండ, నర్సంపల్లి,పల్లెతాండ, పల్గుతాండ జిపిలు ఎస్టీ మహిళకు రిజర్వ్ కాబడ్డాయి. అన్నె బోయిన్‌పల్లి, అంతంపేట, అప్పారెడ్డిపల్లి, ఆర్కపల్లి, కొల్కులపల్లి, నల్లవారిపల్లి బీసి జనరల్ కేటగిరికి, బ్రాహ్మణపల్లి, చంద్రాయన్‌పల్లి, మాడ్గుల, నాగిల్ల, నర్సాయపల్లి జి.పిలు బీసి మహిళకు రిజర్వ్ కాబడ్డాయి. అదేవిధంగా దొడ్లపహాడ్, కాశగూడెం, కొత్తబ్రాహ్మణపల్లి, సంద్రాల్ల గడ్డతాండ జి.పిలు జనరల్ కేటగిరికి రిజర్వ్ కాగా గిరికొత్తపల్లి, కూభ్యతాండ, సుద్ధపల్లి గ్రామపంచాయతిలు జనరల్ మహిళకు రిజర్వ్ కాబడ్డాయి. ఇదిలా ఉండగా బీసి రిజర్వేషన్ల పెంపు జీవోపై న్యాయస్థానం గ్రీన్ సిగ్నల్ లభిస్తే ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఆయా స్థానాలకు కేటాయించబడ్డ రిజర్వేషన్ల మేరకు ఎన్నికల ప్రక్రియ పూర్తిచేసేందుకు ఇప్పటికే అధికారయంత్రాంగం పూర్తిస్థాయిలో సంసిద్ధంగా వున్నట్లు తెలుస్తోంది. అంతేగాకుండ ఒకవేళ రిజర్వేషన్ల పెంపుకు కోర్టు ససేమిరా అంటే రిజర్వేషన్ల మార్పులు, చేర్పులకు అవసరమైన కసరత్తును సైతం అధికారులు పూర్తిచేసినట్లు సమాచారం. దాదాపు రెండేళ్ళ కాలంగా గ్రామ పంచాయతిలు మొదలు మండలపరిషత్, జిల్లాపరిషత్‌లకు పాలకవర్గాలు లేక ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్న ప్రజానీకం స్థానిక ఎన్నికలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నారు. అదేవిధంగా బీసి రిజర్వేషన్ల పెంపుతో బీసి సంఘాలు, నాయకుల నుండి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నది. ఏది ఏమైనా స్థానిక ఎన్నికల నిర్వాహణకు అడ్డంకులు తొలగిపోయి అందరికి ఆమోదయోగ్యమైన రిజర్వేషన్లతో ఎన్నికల ప్రక్రియ పూర్తయితే బాగుండునని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# జడ్పిటిసి బరిలో గోపులారం మాజీ సర్పంచ్ పొడువు శ్రీనివాస్

**-కాంగ్రెస్ పార్టీ నుండి జడ్పిటిసి టికెట్ ఆశిస్తున్న పొడవు శ్రీనివాస్ -సర్పంచ్ గా గోపులారం లో అనేక అభివృద్ధి పనులు -నిత్యం ప్రజలతో మమేకమై, సంక్షేమ పథకాలపై దృష్టి -సర్పంచ్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా సేవలు -చురుకుగా పార్టీకి కష్టపడే నాయకుడిగా గుర్తింపు**



శంకర్పల్లి మెజర్ న్యూస్ (అక్టోబర్ 8)రానున్న స్థానిక ఎన్నికల్లో శంకరపల్లి మండలం నుండి జడ్పిటిసి స్థానానికి మాజీ గోపులారం గ్రామ సర్పంచ్ పొడవు శ్రీనివాస్ బరిలో ఉండేందుకు సిద్ధమవుతున్నారు. మాజీ సర్పంచ్ గా, సర్పంచ్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్ ప్రజలలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. మండలంలో అన్ని గ్రామాలలో కన్నా, శ్రీనివాస్ సర్పంచ్ గా ఉన్నప్పుడు గోపులారం లో ప్రభుత్వం నుండి కోట్ల రూపాయలు నిధులు తెచ్చి, గ్రామంలో సిసి రోడ్లు, అండర్ డ్రైనేజ్ పనులు, వీధి దీపాలు, ఇంటింటికి మంచినీరు అంది వ్వడంలో మంచి పేరు తెచ్చుకున్నారు. సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన నుండి పదవి కాలం అయిపోయే వరకు గ్రామంలో ప్రతి వ్యక్తికి అందుబాటులో ఉంటూ ప్రజల మన్ననలను పొందారు. గ్రామంలో విద్యా ర్థులకు, యువతకు, వృద్ధులకు ఎలాంటి అవసరాలు ఉన్న చకచగా పనులు పూర్తి చేయడంలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. సర్పంచ్ గా కాకుండా ఏ పార్టీలో ఉన్న ఆ పార్టీకి నిత్యం అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేశారు. శంకర్పల్లి మండలం నుండి జడ్పిటిసి అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తనకు అవకాశం ఇస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. తనకు పార్టీ అవకాశం ఇస్తే ప్రజలతో మమేకమై జడ్పిటిసిగా గెలు పొందుతానని ఆశాభావం వ్యక్తం చేశారు. మండలంలో శ్రీనివాస్ కు ప్రతి గ్రామంలో ప్రజలతో, నాయకులతో, పార్టీ కార్యకర్తల తో మంచి సంబంధాలు ఉన్నాయి. శ్రీనివాస్ కు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇస్తే జడ్పిటిసి స్థానం కాంగ్రెస్ పార్టీ వశం అవుతుందని పార్టీ కార్యకర్తల్లో కూడా గుసగుసలు విన బడు తున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం కూడా శ్రీనివాస్‌కు టికెట్ ఇవ్వడానికి సాను కూలంగా ఉందని తెలుస్తుంది. కాంగ్రెస్ పార్టీ జడ్పిటిసి టికెట్ ఎవరికి లభిస్తుందో వేచి చూడాల్సిందే

# ఆశా...నిరాశేనా...!



**మొదటిపేజీ తరువాయి...** స్థానిక సంస్థల ఎన్నికల్లో బాగంగా కేటాయింపబడిన రిజర్వేషన్లు కొంతమంది రాజకీయ నాయకులకు శాపంగా మారింది. షాద్‌నగర్ నియోజ కవర్గం లోని పలు మండలాల్లో ఎన్నో ఆశలు పెట్టుకున్న నేతలు నేడు రిజర్వేషన్ల కారణంగా తలలు పట్టుకుని తమ రాజకీయ భవిష్యత్‌పై మల్లగుల్లాలు పడుతున్నట్లు సమాచారం. తమ పరిస్థితిని బయటకు చెప్పుకోలేని నాయకులు ఏం చేయాలో తెలియక ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తుంది.

### ఫైర్‌బ్రాండ్ కు ఎదురుదెబ్బ...



బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాల్‌రాజ్ గౌడ్

షాద్‌నగర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న బాల్‌రాజ్ గౌడ్ కాంగ్రెస్ పార్టీలో స్థానికంగా ఫైర్ బ్రాండ్‌గా పేరు సాదించాడు. పదేళ్ళుగా అధికారంలో లేకున్నా అప్పటి బీఆర్ ఎస్ ప్రభుత్వ తప్పులను ప్రజల ముందు ఉంచుతూ ఆయన వాగ్దాటి ద్వారా షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజలను చైతన్య పరచడంలో బాల్‌రాజ్ గౌడ్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ఫరూఖ్‌నగర్ మండలం మదురాపురం గ్రామానికి చెందిన బాల్‌రాజ్ గౌడ్ వార్డు మెంబరుగా తన రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టి కాంగ్రెస్ పార్టీలో నియోజకవర్గ ముఖ్య నాయకుడిగా చోటు సంపాదించాడు. కాంగ్రెస్ పార్టీ బాల్‌రాజ్ గౌడ్ సేవలు గుర్తించి గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఫరూఖ్‌నగర్ జెడ్పిటిసిగా బీఫారమ్ ఇచ్చి అవకాశం ఇచ్చింది. ఎంతో హోరాహోరీగా జరిగిన ఈ ఎన్నికలో బాల్‌రాజ్ గౌడ్ కేవలం సుమారు 100 పై చిలుకు ఓట్ల తేడాతో జెడ్పిటిసిగా ఓటమి చెందాడు. ఇదిలా ఉండగా గడచిన అసెంబ్లీ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలవడం అధికారం చేపట్టడంతో ప్రస్తుతం జరిగే స్థానిక ఎన్నికల్లో బాల్‌రాజ్ గౌడ్ మరోసారి జెడ్పటిసిగా పోటీ చేసి తన అదృష్టాన్ని పరిశీలించుకోవాలనుకున్నాడు. ఇందుకు అనుగుణంగానే ఐదేళ్లుగా గ్రామాలలో పనులు చేసుకుంటూ గంపెడాశతో ముందుకు పోయాడు. అయితే షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఫరూఖ్‌నగర్ మండల జెడ్పిటిసి, ఎంపిపి స్థానాలు ఎస్టీ సామాజికవర్గానికి రిజర్వ్ చేయడంతో ఒక్కసారిగా బాల్‌రాజ్ గౌడ్ ఆశలపై నీళ్ళు చల్లినట్లయిందని నియోజకవర్గంలో చర్చనీయాంశమవుతుంది.

### నిరాశలో మహిళా నాయకురాలు...



కేశంపేట మాజీ జెడ్పిటిసి తాంద్ర విశాలశ్రావ ణ్ రెడ్డి

నియోజకవర్గంలోని కేశంపేట మండల జెడ్పిటిసిగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన తాంద్ర విశాల శ్రావణ్ రెడ్డి ఆ మండలంలో సేవా కార్యక్రమాల ద్వారా తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. రాజకీయ నాయకురాలిగా తమకు ఆ పార్టీలో సరైన గౌరవం లబించకపోవడంతో గడచిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరి ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపులో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి వెంట ఉంటూ తమదైన పాత్ర పోషించారు. మండలంలో అకస్మాత్తుగా ఎవరు మరణించినా... ఎవరికి ఆపద ఉన్నా వెంటనే స్పందిస్తూ ఆర్థిక సహాయం చేయడమే కాకుండా ఏమాత్రం పట్టింపులు లేకుండా బాధిత కుటుంబాలను పరామర్శిస్తూ ఆమె మండల ప్రజల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. అయితే స్థానిక ఎన్నికల వేళ కేశంపేట మండలం జెడ్పిటిసి, ఎంపిపి స్థానాలు బీసిలకు రిజర్వ్ కావడంతో ఆమె ఇంతకాలం పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయి. క్రియాశీల రాజకీయాల్లో చురుకుగా ఉండే ఇలాంటి నాయకులు రిజర్వేషన్ల కారణంగా ప్రజలకు దూరమవడం వారి అభిమానులు జీర్ణించుకోలేక పోతున్నారు. అభిమానులతో పాటుగా రిజర్వేషన్ల కేటాయింపుపై మాజీ జెడ్పిటిసి దంపతులు అసహనంగా ఉన్నట్లు తెలుస్తుంది.

### యువనాయకుడికి చుక్కెదురు...



కాంగ్రెస్ యువ నాయకడు పురుషోత్తం రెడ్డి

ఇక కొందుర్గు మండలానికి చెందిన కాంగ్రెస్ యువనాయకుడు, మహబూబ్‌నగర్ పార్లమెంటరీ నాయకుడు పురుషోత్తం రెడ్డికి సహితం రిజర్వేషన్ల సెగ తగిలిందని చెప్పవచ్చు. ఎంతో కాలంగా కొందుర్గ మండలంలో ప్రజాప్రతినిదిగా సేవలందించాలనే లక్ష్యంలో ఉన్న యువనాయకుడికి రిజర్వేషన్ల కేటాయింపు అనుకూలించలేదని చెప్పవచ్చు. కొందుర్గు మండల జెడ్పిటిసి, ఎంపిపి రెండు స్థానాలు బీసిలకు కేటాయించడంతో జెడ్పిటిసిగా బరిలో నిలవాలని బావించిన అతనికి చుక్కెదరయిందనే వార్తలు మండలంలో చక్కర్లు కొడుతున్నాయి. ఇలా రిజర్వేషన్ల కేటాయింపు కారణంగా షాద్‌నగర్ కాంగ్రె స్ పార్టీలో ఉన్న నాయకులపై ఇలాంటి ప్రబావం చూపితే ఇతర పార్టీల్లో ఎలా ఉందో మరో కథనంలో తెలుసుకుందాం.

# వర్షం పడితే శ్రీరామ కాలనీలో నరకం చూడాల్సిందే

- వర్షపు నీటితో డ్రైనేజీ పొంగి రోడ్లన్నీ జలమయం
- ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు, స్కూల్ విద్యార్థులు
- కారణాలు తెలిసిన చర్యలు చేపట్టని అధికారులు



జల్ పల్లి, మేజర్ న్యూస్ (అక్టోబర్ 07):జల్ పల్లి మున్సిపాలిటీ శ్రీరామ కాలనీలో వర్షం పడితే రోడ్లు జలమయం అయ్యి ప్రజలు నరకం చూడాల్సిందే. మంగళవారం కురిసిన వర్షానికి శ్రీరామ కాలనీ రోడ్లు నీట మునిగి ప్రయాణికులకు తీవ్ర అంతరాయం కలిగించింది. నగరానికి కూతవేటు దూరంలో ఉన్న శ్రీరామ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగ ఉండటం, దీంతో వర్షపు నీరు డ్రైనేజీలో కలిసి, రెండు రోడ్లపై వరదల ప్రవహించి ప్రయాణికులు, స్కూల్ విద్యార్థులు అనేక అవస్థలు పడే దుస్థితి నెలకొంది. నగరానికి సమీపంలో ఉన్న జల్ పల్లి పేరుకే మున్సిపాలిటీ అని, బోడగుండుపై మల్లె చండు పెట్టినట్టుగా, ప్రభుత్వాలు మారిన అభివృద్ధికి మాత్రం నోచుకోవడం లేదంటున్నారు. మధుబన్ కాలనీ నుండి శ్రీరామ కాలనీకి వచ్చే ప్రధాన రహదారిలో చెత్త, రోడ్లు గుంతలుగా మారడం, నీరు కుంటలోకి వెళ్లకుండా నాళాలో చెత్త పేరుకుపోవడం ముఖ్య కారణాలు. అయినా వాటి పట్ల మున్సిపల్ అధికార యంత్రాంగం చర్యలు చేపట్టకపోవడం శ్రీరామ కాలనీ ప్రజలకు




శాపంగా మారింది. గతంలో వర్షాలు కురిసినప్పుడు డ్రైనేజీ సమస్యతో కాలనీ ప్రజలు నెలల తరబడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడంతో కొత్త డ్రైనేజీ పైపులు వేశారు.కానీ ప్రస్తుతం వాటి వలన ప్రయోజనం లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు. శ్రీరామ కాలనీలో వర్షం పడితే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, వాటికి గల ముఖ్య కారణాలను మున్సిపల్ అధికారులు గ్రహించి తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# పరిశ్రమ వ్యర్థాలతో పూడూరు ప్రజలకు ఇబ్బందులు

**● రోడ్డు పక్కన చెత్త వేస్తున్న మెగాసిటీ మౌల్డింగ్ కంపెనీ సిబ్బంది**

**మేడ్చల్, మేజర్ న్యూస్ (అక్టోబర్, 07):**
మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని పూడూరు గ్రామంలో ఉన్న మెగాసిటీ మౌల్డింగ్ కంపెనీ నుండి వెలువడుతున్న పరిశ్రమ వ్యర్థాలు స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి.

కంపెనీ సిబ్బంది రోడ్డు పక్కన బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను వదిలి వెళ్లడం ప్రజల్లో ఆగ్రహానికి దారితీసింది. వాటి నుండి వస్తున్న దుర్వాసన, ఘాటైన వాసనలు చుట్టుపక్కల నివాసులను ఇబ్బంది పెడుతున్నాయి. ఈ సందర్భంగా గ్రామస్థులు పేర్కొన్న ప్రకారం,.. రాత్రివేళల్లో కంపెనీ వాహనాలు వచ్చి పరిశ్రమ వ్యర్థాలను రహదారి పక్కన పారబోస్తున్నాయి. ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కల వద్ద వ్యర్థ పదార్థాలు వేయడం వలన మొక్కలు ఎండిపోతున్నాయని గ్రామస్థులు తెలిపారు. ఇలాగే పరిస్థితి కొనసాగితే గ్రామ [illegible] కలుషితమవుతాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలు మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి కంపెనీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



**వ్యర్థాలను వదిలి వెళ్లే వారిపై కఠిన చర్యలు తప్పవు:**
పూడూరు వార్డ్ ఆఫీసర్ రాజా బాబు మాట్లాడుతూ,.. "రోడ్డు పక్కన విచ్చలవిడిగా వ్యర్థాలను వదిలి వెళ్లే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటాం. పరిశ్రమ యాజమాన్యం వ్యర్థాలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలి. లేకపోతే కంపెనీ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం," అని ఆయన హెచ్చరించారు.

## మహర్షి వాల్మీకి స్ఫూర్తి

# నిత్యనూతనమై నిలవాలి

*మొదటిపేజీ తరువాయి...*
అనంతరం ఆయన మాట్లాడుతూ, మహర్షి వాల్మీకి బోధనలు సమాజానికి స్ఫూర్తిదాయకమని, ఆయన చూపిన మార్గం నేటి తరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం, సేవాభావం, సత్యనిష్ఠలు వాల్మీకి బోధనల సారాంశమని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆయన చూపిన దారిలో నడిస్తే సమాజంలో సౌహార్దం నెలకొంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, జిల్లా రెవెన్యూ అధికారి జే.ఎల్.బి. హరిప్రియ, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి టి. ఝాన్సీ రాణి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి పద్మజ, అలాగే శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

## నేడే హైకోర్టులో 42 శాతం

# బీసీ రిజర్వేషన్ల విచారణ

*మొదటిపేజీ తరువాయి...* ఇదే వ్యవహారం సుప్రీం కోర్టు బంతిలో కూడా ఉన్న రెండు రోజుల క్రితం ఫుల్ స్టాప్ పడింది. బీసీలకు సంబందించిన 42శాతం రిజర్వేషన్‌ల వ్యవహా రం ముందుగా హైకోర్టులో ఉన్నందున సుప్రీం కోర్టు అందుకు సంబందించిన పిటిషన్‌ను డిస్మిస్ చేసి,హైకోర్టునే ఆశ్రయించాలి అని పిటిషనర్ కు పలు సూచనలు చేసింది.ఈ రిజర్వేషన్‌ల తుది విచారణ నేడు హైకోర్టులో ఘాటుఘాటుగా సాగనుంది.సుప్రీం కోర్టులో బలమైన వాదనలు వినిపించిన రాష్ట్ర సర్కార్ నేడు విచారణలో వాదనలను ఎలా వినిపిస్తుందోనని బీసీ వర్గాలకు చెందిన మేధావి వర్గాలు ప్రత్యేక దృష్టిపెట్టారు. 42శాతంకు పెంచిన బీసీ రిజర్వేషన్ లు మెజార్టీ కాపు పెద్దలకు ఇష్టం లేదని గుసగుసలు వినిపిస్తున్నాయి.ఈ లోకల్ బాడీస్ ఎన్నికల రిజర్వేషన్‌లలో బీసీలకు అధికంగా స్థానాలు పెరిగి ఓసీలకు బాగా తగ్గి పోవడంతో ఓసీలు లోలోన తీవ్రంగా రోదన చెందుతున్నారు.ఈ రిజర్వేషన్‌ల పెంపు ఒక్క రాజకీయాలకే పరిమితం కాదు అని మున్ముందు విద్యా,ఉద్యోగాలలలో,ప్రైవేట్ సెక్టర్లకు కూడా పాకుతుంది అని, అలాగే మరింత లోతుగా వెళ్ళితే తెలంగాణలో ఏర్పడిన బీసీ రిజర్వేషన్‌లు దేశ వ్యాప్తంగా అమలుకు డిమాండ్ వస్తుంది అని మెజార్టీ కాపు వర్గాల పెద్దలు గగ్గోలు పడుతున్నారు.రకరకల కోణాల్లో ఉన్న ఈ వ్యవహా రంలో హైకోర్టు తీర్పు ఎలా వస్తుందో అని అందరు తీవ్ర ఉత్కంఠంగా ఎదురు చూస్తున్నారు మరీ కొన్ని గంటలో ఏదో ఒక్కటి తెలిపోనుంది.

# బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు



**● తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సమక్షంలో చేరికలు**

**● కండువాలు కప్పిన ఎమ్మెల్యే బుయ్యని**

**తాండూరు, మేజర్ న్యూస్ (అక్టోబర్ 7):**
తాండూరు నియోజకవర్గం లోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన శ్రేణులు కాంగ్రెస్ పార్టీలోకి జంప్ అవుతున్నారు. ఇందులో భాగంగానే మంగళవారం నాడు తాండూరు మండలం చెంగేష్ పూర్, కోనాపూర్, గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హైదరాబాద్ నగరంలోని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లోకి చేరారు. పార్టీలోకి చేరిన వారికి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ....తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు జరుపుతున్న సంక్షేమ పథకాలు, వివిధ అభివృద్ధి పనులను చూసి అందరు కాంగ్రెస్ పార్టీ పట్ల ఆకర్షితులు అవుతున్నారు అని అన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఒక్కటే అండగా ఉంటుంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దార సింగ్,తాండూరు నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ లొంకా నర్సిములు, నేతలు బంటు వేణుగోపాల్, శ్రీధర్. తదితరులు ఉన్నారు.

## సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేసినందున తాండూరులో నిరసన

**● అంబేద్కర్ చౌక్ వద్ద నిరసన చేపట్టిన పలువురు నేతలు**




**తాండూరులో నిరసన చేపట్టిన దృశ్యం.**

**తాండూరు మేజర్ న్యూస్(అక్టోబర్ 07):** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గావాయి పైన రెండు రోజుల క్రితం జరిగిన దాడి పట్ల తాండూరు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం నాడు సెక్యులర్ వాదుల సమక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు.కొవ్వొత్తుల ప్రదర్శన చేసి మానవత వాదులు,సెక్యులర్ వాదులు ఈ దాడికి తీవ్రంగా ఖండించారు.కొన్ని రోజులుగా జరుగుతున్న ప్లాన్ లో భాగంగానే ఈ దాడి జరిగిందని పలువురు వెల్లడించారు.భారత రాజ్యాంగం పట్ల విశ్వాసం కలిగిన వారు ప్రతి ఒక్కరూ ఈ దాడిని ఖండించాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఎస్ నాయకు లు సాంబూరు సోమశేఖర్, వివిధ ప్రజా సంఘాలకు చెందిన నేతలు:చంద్రయ్య, కే.శ్రీనివాస్, అబ్దుల్ వహద్,అంజద్ అలీ పాషా,న్యాయవాదులు:గోపాల్,అరుణ్ నాయక్,అరుణ్ రాజ్,తదితరులు పాల్గొన్నారు.

# పాత్లవాత్ రమేష్ నాయక్ ఆచూకీ వెంటనే తెలుపాలి...

**బీజేపీ రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షులు రవి నాయక్**

**దౌల్తాబాద్,మేజర్ న్యూస్ (అక్టోబర్ 07):**
మండలంలోని బోడమర్రి గడ్డ తండాకు చెందిన పాత్లవాత్ రమేష్ నాయక్ గత 15 రోజులుగా కనిపించడం లేదని, అతని ఆచూకీ తెలపాలని బిజెపి రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షులు రవి నాయక్ కోరారు. పాత్లావత్ రమేష్ నాయక్ నారాయణ పేట్ జిల్లా మద్దూర్ మండల కేంద్రంలో కంటి దావఖాన ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నడు.అతనికి మత మార్పిడి చేసుకోవాలి అని మద్దూర్ మండల కేంద్రానికి చెందిన తాజద్దీన్, రమేష్ నాయక్‌ను 15 రోజుల కిందట కిడ్నాప్ చేసి ఆచూకీ తెలియకుండా చేసిన తాజద్దీన్‌ను వెంటనే అరెస్ట్ చేయాలనీ ఆయన తెలిపారు. ప్రభుత్వం అండతో తాజద్దీన్ అరాచకాలు సాగిస్తున్నాడని వెంటనే మిస్సింగ్ అయినా రమేష్ నాయక్‌ను 48 గంటల్లో విడుదల చేయాలనీ లేనిచో పెద్ద ఎత్తున ధర్నాలు, రాస్తారోకోలకు చేపడుతాం అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కళ్యాణ నాయక్ ,సీనియర్ నాయకుడు నాగురావ్ నమాజీ, జిల్లా అధ్యక్షులు సత్య యాదవ్, బిజెపి నాయకులు పగడాకుల శ్రీనివాస్, ప్రతాప్ రెడ్డి, బంటు రమేష్, కూంద్రు నరసింహులు, మదన్, సతీష్ ముదిరాజ్, పునాంచంద్ లావోటి,చీపిరి వెంకటయ్య, విజయభాస్కర్ రెడ్డి, రవి నాయక్, అశోక్. బీజేపీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సూర్య
www.suryaa.com

బుధవారం
8 అక్టోబర్ 2025

# ఎల్లమ్మ ఆలయానికి రోడ్డు సమస్యను పరిష్కరించండి

- బీజేపీ నాయకులు అందెల శ్రీరాములుయాదవ్
- నీట మునిగిన రోడ్డుతో భక్తులకు ఇబ్బందులు
- ఒక వర్గం ఓట్లతో గెలిచినందుకు హిందువులపై వివక్ష చూపుతున్న సబితా ఇంద్రారెడ్డి



మహేశ్వరం,మేజర్‌న్యూస్(అక్టోబరు 07): శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయానికి వేళ్ళె దారిని త్వరగా పరిష్కరించాలని మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇంచార్జీ అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. మంగళవారం తుక్కుగూడ మున్సిపాలిటీ లోని ప్రసిద్ధిగాంచిన శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారి గత నెల రోజులుగా కురుస్తున్నటువంటి భారీ వర్షాలకు రోడ్డు మార్గం పూర్తిగా మునిగిపోవడంతో భక్తులు ఆలయానికి వెళ్లే మార్గంలో అనేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకొని రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్ మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇంచార్జీ అందెల శ్రీరాములు యాదవ్ స్థానిక బిజెపి నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రధాన రహదారిని సందర్శించారు. ఈ సందర్భంగా భక్తులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బల్కంపేట ఎల్లమ్మ తల్లి ఆలయం తర్వాత అత్యంత ప్రసిద్ధిగాంచిన ఆలయంగా సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయం అని పేర్కొన్నారు. ఆలయానికి సరైనటువంటి ప్రధాన రహదారి లేకపోవడం ఉన్న రహదారి కూడా భారీ వర్షాలకు మునిగిపోవడం వల్ల భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికార కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హిందువుల సమస్యలు పట్టించుకోరా అని ప్రశ్నించారు. నియోజకవర్గ వ్యాప్తంగా హిందూ ఆలయాల సమస్యలను పట్టించుకోవట్లేదని కేవలం ఒక వర్గం మెప్పుకోసం హిందువులపై వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. వెంటనే ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారిని డబుల్ లైన్ రోడ్డు నూతనంగా నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ హయాంలో సబితా ఇంద్రా రెడ్డి ఓఆర్ఆర్ నుండి ఆలయం వరకు 100 ఫీట్ల రోడ్డును నిర్మిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. హిందువులకు ఇచ్చిన హామీలు మర్చిపోతారు కానీ జల్పల్లి మున్సిపాలిటీ లో ఒక వర్గానికి ఇచ్చిన హామీని గుర్తుపెట్టుకుని పనులు పూర్తి చేశారని, హిందువులు ఏం పాపం చేశారని ప్రశ్నించారు. నియోజకవర్గ వ్యాప్తంగా అనేక చెరువులను నాడు సబితా ఇంద్రారెడ్డి అనుచరులు రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు కబ్జాలు చేశారని వాటిపై నేటికీ హైడ్రా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులు మాజీ చైర్మన్ బరిగెల హేమలత రాజు గౌడ్, మాజీ చైర్మన్ కాంటేకార్ మధుమోహన్ , మాజీ అధ్యక్షులు రచ్చ లక్ష్మణ్, మాజీ ఫ్లోర్ లీడర్ శివకుమార్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు బోధ యాదగిరి రెడ్డి, రాజామోని రాజు ముదిరాజ్, జాపాల సుధాకర్, బాకీ విలాస్, బిజెపి సీనియర్ నాయకులు తలారి శ్రీను, శ్రీనివాస్ నాయక్, స్వామి గౌడ్, రవి నాయక్, శ్రీశైలం యాదవ్, మహేష్ బిజెపి, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.



# రాజ్యాంగం రిజర్వేషన్లపై బీజేపీ దాడి చేస్తుంది

- మహేశ్వరం ఇంచార్జీ కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి
- ఆకులమైలారంలో సంతకాల సేకరణ



కందుకూరు,మేజర్‌న్యూస్( అక్టోబర్ 07):రాజ్యాంగం రిజర్వేషన్లపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దాడి చేస్తుందని మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జీ, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు.మంగళవారం మండలంలోని ఆకులమైలారంలో ఓట్ల చోరిపై సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజాస్వామ్యానికి దొంగ ఓట్లు గొడ్డలి పెట్టు అని, కాంగ్రెస్‌కు అనుకూలంగా కొన్ని వర్గాల ఓట్లును బీజేపీ, ఈసీ తొలగించి కుట్రలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు.కులం,మతం ఆధారంగా ఓట్లను తొలగిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై రాహుల్‌గాంధీ ఇప్పటికే ఉద్యమిస్తున్నారని కెఎల్ఆర్ గుర్తు చేశారు.రాజ్యాంగాన్ని,రిజర్వేషన్లను అంతం చేయాలని బీజేపీ సర్కార్ ప్రయత్నం చేస్తుందని పేర్కొన్నారు. ప్రతి బూత్ స్థాయిలో వంద సంతకాలు పెట్టించి ఈసికి నిరసన తెలపాలని కోరారు. కెఎల్ఆర్ ఆధ్వర్యంలో పలు పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కష్ణనాయక్ మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, పీఏసీఎస్ పీఐసీ చైర్మన్ సత్తినేని వెంకట్రామ్‌రెడ్డి, సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, గంగుల ప్రభాకర్‌రెడ్డి, సరికొండ పాండు, మల్లేష్, డిల్లీ శ్రీధర్, మాజీ సర్పంచ్ గొరిగె కలమ్మరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కంబాలపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రశాంత్‌కుమార్, సురేందర్, యుగేందర్, యూత్ అధ్యక్షుడు సౌడపు వెంకటేష్ గౌడ్, నాయకులు రాణప్రతాప్‌రెడ్డి,భూపాల్‌రెడ్డి, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలి



కొందుర్గు, మేజర్‌న్యూస్(అక్టోబర్ 7): ఎన్నికల అధికారులు ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని ఎంపిడివో అనురాధ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయంలోని సమావేశపు మందిరంలో ఎన్నికల్లో పాల్గొనే రిటర్నింగ్ అధికారులకు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడివో అనురాధ మాట్లాడుతూ ఎన్నికలను పకడ్బందిగా నిర్వహించాలని, ఇందుకోసం తెలియని విషయాలను ఎన్నికల అధికారులు తప్పని సరిగా తెలుసుకోవాలని అన్నారు. సమావేశంలో తహాశీల్దార్ మీర్ ఆజం అలీ, ఆర్వోలు జీవన్‌సింగ్, ఎంపివో విజయకుమార్ పాల్, సురేష్ రెడ్డి, గాయత్రిదేవి, జోనల్ అధికారులు, రూట్ అధికారులు పాల్గొన్నారు.

## హనుమాన్ దేవాలయంలో అన్నదాన కార్యక్రమం....



మణికొండ, మేజర్ న్యూస్ (అక్టోబర్ 07): మణికొండ మున్సిపల్‌లోని ల్యాంకోహిల్స్ రోడ్డులో గల వీర హనుమాన్ దేవాలయంలో గత 5 సంవత్సరాలుగా ప్రతి మంగళవారం జరిగే అన్నదాన కార్యక్రమంలో భాగంగా మంగళవారం మణికొండ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ శ్వేతా కిరణ్‌కుమార్ మరియు వారి కుటుంబ సభ్యుల ఆద్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించగా 500 మందికి పైగా భక్తులు పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పురుషోత్తం మాజీ వార్డు సభ్యులు ప్రవీణ్‌కుమార్, సంఘం అశోక్, భారతరెడ్డి, బి. రాములు, శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్, కరుణాకర్, నరేందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి ఖండన

ఆరుట్లలో వివిధ పార్టీల నాయకలు అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం



మంచాల, మేజర్ న్యూస్ (అక్టోబర్ 07) : రాజ్యాంగ బద్దమైన న్యాయ వృత్తిలో ఉన్న సీజేఐ బిఆర్ గవాయ్ పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని వివిధ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆరుట్ల గ్రామంలో వివిధ పార్టీల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. దేశంలో ధర్మం పేరుతో అధర్మంగా దాడులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ దేశంలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికే రక్షణ లేదంటే అణగారిన వర్గాలపై వివక్ష, దాడులు ఎంత దారుణంగా జరుగుతున్నాయో ఇట్టే అర్థం అవుతుందని అన్నారు. ప్రధాన న్యాయమూర్తిపై చెప్పుతో దాడికి పాల్పడిన ఆ లాయర్‌ను న్యాయవాద వృత్తి నుంచి శాశ్వతంగా తొలగించాలని, దేశ ద్రోహం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కంబాలపల్లి భాస్కర్, మాజీ ఎంపీటీసీ చీరాల రమేష్, అడ్వకేట్ మంకు మురళి, మాజీ కోఆప్షన్ సభ్యులు యూసుఫ్ అలీ, సలాం, అనంగల పరమేష్, పున్నం రాము, సీపీఎం నాయకులు బద్దు విజయ్, డీఎస్‌పీ నాయకులు కొండిగారి శ్రావణ్, దామెర భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

## సీజేఐపై దాడికి యత్నించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

–అధ్యక్షులు బాన్సువాడ వేదంత్‌మౌర్య



చేవెళ్ల, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 07)ః సుప్రీం కోర్టులో భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడికి యత్నించిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బాన్సువాడ వేదంత్‌మౌర్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేసు విచారణ సందర్భంగా వాదనాలు వినిపిస్తున్న లాయర్ లోకేష్ ఏకంగా ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడి చేసేందుకు యత్నించడాని తన షూ తీసి బీఆర్ గవాయ్‌పై విసిరేందుకు ప్రయత్నించగా అప్రమత్తమైన భద్రత సిబ్బంది, తోటి లాయర్‌ను అడ్డుకున్నారన్నారు. భారతదేశ న్యాయవ్యవస్థలో అత్యున్నత స్థానంలో ఉన్న బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి దేశ ప్రజలను కలచివేసిందన్నారు. ఈ ఘటనను వివిధ పార్టీల నేతలు, ప్రముఖులు ఖండించాలన్నారు. దేశచరిత్రలో ఇది ఒక చీకటి రోజు అని, ఇలాంటి పిరికిపంద దాడులతో తాను వెనక్కి తగ్గబోనని ధైర్యంగా ప్రకటించిన బీఆర్ గవాయ్‌కు విద్యార్థి లోకం సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ల మద్దతు ఎల్లప్పుడు ఉంటుందన్నారు.

## సీపీఎం నాయకుని భౌతికకాయానికి నివాళులు



కందుకూరు, మేజర్‌న్యూస్(అక్టోబర్ 07: సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు, రాచులూరు గ్రామ శాఖ కార్యదర్శి చిర్ర నర్సింహ అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మరణించారు. విషయం తెలుసుకున్న మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ ఆధ్వర్యంలో బౌతికకాయానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలోజిల్లా కార్యవర్గ సభ్యుల రామచందర్, బుడ సామేల్, ఆలంపల్లి నర్సింహ, జంగయ్య శ్రీశైలం, శ్రీనివాస్, కుమార్, చందు, ఎన్.నర్సింహ, అంజయ్య, ఏర్పుల శేఖర్, రవికుమార్, తదితరులు ఉన్నారు.

## ఘనంగా మహర్షి బోయ వాల్మీకి జయంతి...



మణికొండ, మేజర్ న్యూస్ (అక్టోబర్ 07) ః మహర్షి బోయ వాల్మికి జయంతి పురస్కరించుకొని మణి కొండ మణికొండ మున్సి పల్‌లోని ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు టి. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పి. ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి విజయ్ నాయుడు, కోశాధికారి పి. సహదేవ్ నాయుడు అలాగే కార్యవర్గ సభ్యులు ఎం. రాజు, టి. రామకృష్ణ, జి. పరశురాం, జి. చెన్నయ్య, టి. రమేష్ మరియు కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# RRR ఉద్యమం....

# లగచర్ల ఉద్యమాన్ని తలపించాలి

- RRR రైతులకు అండగా ఉంటాం
- పాత అలైన్మెంట్ ప్రకారం ట్రిబుల్ ఆర్ రోడ్డు నిర్మించాలి
- మాజీమంత్రి, ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి
- రైతులు భూములు నమ్ముకుని బతుకుతుంటే, రేవంత్ రెడ్డి భూములు అమ్ముకుని బతుకుతున్నాడు..
- వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్
- చిట్టిగిద్ద గ్రామంలో RRR బాధిత రైతులకు భరోసా కల్పించిన బిఆర్ఎస్ నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే సభితా రెడ్డి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (అక్టోబర్ 07) :** RRR ఉద్యమం లగచర్ల ఉద్యమాన్ని తలపించాలని మాజీ మంత్రివర్యులు, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం వికారాబాద్ జిల్లా నవాబ్ పెట్ మండలం చిట్టి గిద్ద గ్రామంలో RRR బాధిత రైతులను ఆమె వికారాబాద్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌తో కలిసి పరామర్శించి, భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.....

తక్కువ ధరలకు తమ భూములు లాక్కునేందుకు ఈ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని, ఎలాగైనా తమ భూములను కాపాడాలని కోరిన బాధిత రైతులకు ఈ విషయంలో ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ట్రిబుల్‌ఆర్ బాధిత రైతులు అందరూ ఏకమై ఒక జేఏసీ ఏర్పాటు చేసుకోవాలని, జేఏసీ ఆధ్వర్యంలో ప్రభుత్వంపై పోరాటం చేయాలని ఆమె కోరారు. జేఏసీ తరఫున ఎలాంటి కార్యక్రమాలు చేపట్టిన తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ట్రిబుల్‌ఆర్ ద్వారా రైతులకు ఎట్టి పరిస్థితుల్లో అన్యాయం జరగకుండా చూస్తామన్నారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మాట్లాడుతూ..... రాష్ట్రంలో రైతులు భూములు నమ్ముకుని బతుకుతుంటే, రేవంత్ రెడ్డి మాత్రం భూములు అమ్ముకుని బతుకుతున్నాడు అని ఆరోపించారు. రాష్ట్రంలో విలువైన భూములపై కన్నేసిన రేవంత్ రెడ్డి వాటిని అమ్మే పనిలో నిమగ్నమైపోయారని విమర్శించారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి RRR (రీజనల్ రింగ్ రోడ్) అలైన్మెంట్ పైన కనీస అవగాహన లేకపోవడం సిగ్గుచేటు అన్నారు.



మహిళా రైతులతో మాట్లాడుతున్న సబితా రెడ్డి

ముఖ్యమంత్రి, గౌరవ స్పీకర్, మంత్రులు మరియు ఎమ్మెల్యేలు RRR బాధిత రైతులతో సమావేశం ఏర్పాటు చేసుకొని ఒకసారి వారి బాధలు వినాలని ఆయన కోరారు. RRR బాధిత రైతులందరు పార్టీలతో సంబంధం లేకుండా ప్రజాప్రతినిధులను వారి ఇళ్లకు వెళ్లి నిలదీయాలన్నారు. మన వికారాబాద్ జిల్లా నుంచి ముఖ్యమంత్రి ఉండడంతో జిల్లా ప్రజలందరు అభివృద్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు... కానీ ఆనాటి రోజులు తెస్తా అని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిజంగానే అందరిని రోడ్డుమీదకు లాగారని ఆరోపించారు. తన ఫ్యూచర్ ఏంటో తెలియని ముఖ్యమంత్రి ఫ్యూచర్ సిటీ అని గొప్పలకు వెళుతున్నాడన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు భూమికి భూమి లేదా సంతృప్తి కలిగేలా పరిహారం అందించి, వారి పూర్తి అంగీకారంతో మాత్రమే భూ సేకరణ జరపాలని తెలిపారు. పాలకులు మరియు అధికారుల సమన్వయ లోపంతో అనేకమైన తప్పులతో జీవోలు జారీ చేసి, రైతులను, ప్రజలను అయోమయానికి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఎస్ఈడబ్ల్యూఐడి సి మాజీ చైర్మన్ నాగేందర్ గౌడ్, బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్, నాయకులు దేశామొల్ల ఆంజనేయులు, భరత్ రెడ్డి, దయాకర్ రెడ్డి, విజయ్, శాంతకుమార్, గౌస్, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, రైతులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



రైతుల సమస్యలను మాజీ మంత్రికి విన్నవిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్.

## పాఠశాలల్లో మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి...

- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి
- జెకెఎమ్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో

**5 స్వచ్ఛ ట్రక్ ఆటోలు ప్రారంభం**

వికారాబాద్ మేజర్ న్యూస్ (సెప్టెంబర్ 07): వికారాబాద్ పట్టణంలో కొత్తగా ఐదు స్వచ్ఛ ట్రక్కులను చేవెళ్ల ఎం.పి. కొండా విశ్వేశ్వర్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రస్తుతం 11 మండలాలలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచడానికి 11 స్వచ్ఛ ట్రక్కులు పనిచేస్తున్నాయని తెలిపారు. అదనంగా కొత్తగా 5 స్వచ్ఛ ట్రక్కులు ప్రారంభించడంతో మొత్తం కలిపి 16 స్వరచ ట్రక్కులు 16 మండలాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలలో మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచనున్నాయి. పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు శుభ్రంగా ఉండడానికి గత పది సంవత్సరాల నుండి స్వచ్ఛ ట్రక్కులు పనిచేస్తున్నాయని, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఉన్న అన్ని మండలాలలో అన్ని పాఠశాలల్లో ఉన్న మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచడమే తమ లక్ష్యమని తెలిపారు. స్వచ్ఛ ట్రక్కులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచడమే కాకుండా స్థానిక యువతకు ఉద్యోగ అవకాశం కూడా కల్పిస్తున్నట్టు చెప్పారు. ఒక్కొక్క స్వచ్ఛ ట్రక్కు 30 స్కూళ్లు, మొత్తంగా ఈ 16 స్వచ్ఛ ట్రక్కులు 330 ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచనున్నాయి.






ట్రక్కును ప్రారంభిస్తున్న ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి

## రెండు రోజులపాటు

## మిషన్ భగీరథ నీళ్లు బంద్...




**బషీరాబాద్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 07):** బషీరాబాద్ మండలంలో ఉన్న అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా రెండు రోజులు నిలిపియడం జరుగుతుందని మిషన్ భగీరథ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాసింపూర్ బండవాగు వరదల కారణంగా పైప్ లైన్ డామేజ్ కావడం జరిగిందని అందువల్ల 08/10/25 నుండి 09/10/25 నీటి సరఫరా బంద్ కావడం జరుగుతుంది మీరు లోకల్ సోర్సెస్ వినియోగించగలరని మనవి చేశారు.

# బైరాగి గూడా రోడ్డు సమస్యను పరిష్కరించండి: కాంగ్రెస్ పార్టీ నాయకులు




గండిపేట్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 07)బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బైరాగి గూడా నుండి నార్సింగి కి వెళ్లే రోడ్డు సమస్య ను పరిష్కరించాలని కమిషనర్ శరత్ చంద్ర కు వినతి పత్రాన్ని అందజేసిన బిజెపి కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. బైరాగి గూడా నుండి నార్సింగి కి వెళ్లే రక్షణ శాఖ రోడ్డు మార్గం వర్షాల కారణంగా అడుగు లోతు గుంతలతో అధ్వానంగా తయారైందని అన్నారు. దీని కారణంగా ఈ రోడ్డు మార్గం గుండా వెళ్లే వాహనదారులు కుదుపులతో అవస్థలు పడుతున్నారని తెలిపారు. రోడ్డు మార్గాన్ని తామంతా కలిసి జెసిబి లతో మరమ్మతులు చేయడానికి వెళ్లగా ఆర్మీ అధికారులు పనులను అడ్డుకున్నారని వెల్లడించారు. బి జె ఎం సి కమిషనర్ ఆర్మీ అధికారులతో సంప్రదించి రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరామని పేర్కొన్నారు. బైరాగి గూడ రోడ్డుకు మరమ్మతులు చేయడం వలన వందలాదిమంది వాహనదారులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి ప్రేమ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఏ బ్లాక్ అధ్యక్షుడు డప్పు నవీన్ కుమార్,మాజీ ఎంపీటీసీ భోగాల శ్రీనివాస్ , బీసీ సెల్ అధ్యక్షులు అంకం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీటీసీగా ఒక్క అవకాశం ఇవ్వండి : ప్రజలను, పార్టీని కోరిన కొంగరి లింగం





యాచారం,మేజర్ న్యూస్ (అక్టోబర్ 7 ): యాచారం మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ అయిన నంది వనపర్తి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొంగరి లింగం ఎంపీటీసీగా తనకు ఒక అవకాశం ఇవ్వమని, కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని, గ్రామ ప్రజలను కోరుతున్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడిన కొంగరి లింగం, యాచారం మండల కేంద్రంలో సోమవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో హాజరై నంది వనపర్తి ఎంపిటిసి అభ్యర్థిగా తన పేరు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొంగరి లింగ మాట్లాడుతూ... వయసులో తక్కువ వాడినైనా 20 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని, నంది వనపర్తి ఎంపిటిసి అభ్యర్థిగా రెండుసార్లు ఓటమి చెందానని తెలిపారు. గతంలో తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించినట్లు, తెలంగాణ ఉద్యమంలో మండల కేంద్రంలో నుంచి పోరాడిన ఉద్యమకారుల్లో ముందు వరుసలో తాను ఉన్నానని, ప్రజలకు అందరికీ తెలుసునని అన్నారు. పార్టీ కోసం, పార్టీ లక్ష్యం కోసం నిబద్ధతతో పనిచేస్తానని, తనను గుర్తించి అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రలోభ పెట్టే రాజకీయం తనది కాదని, నీతి, నిజాయితీ తన లక్ష్యమని, ప్రజాసేవ చేయడం తన మార్గమని పేర్కొన్నారు. నంది వనపర్తి ప్రజలు ఈసారి తనపై నమ్మకం ఉంచి ఆశీర్వదించాలని, తమకు ఎల్లప్పుడూ సేవకుడిలా పని చేస్తానని పేర్కొన్నారు.

## ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి రక్షించాలి

**–సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ప్రభులింగం**




చేవెళ్ల, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 07)ః ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి రక్షించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ప్రభులింగం కోరారు. మండల పరిధిలోని న్యాలట గ్రామ రెవెన్యూలోని సర్వే నెం.240లో గల ప్రభుత్వ భూమిని కొంతమంది కబ్జాదారులు, రాజకీయ నాయకులు కబ్జా చేసి క్రయవిక్రయలు చేస్తున్నారని, నిరుపేదలకు కేటాయించిన ఇండ్ల స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడి పట్టాలిచ్చిన పేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని తహసీల్దార్ కృష్ణయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో ఇన్సాబ్ జిల్లా అధ్యక్షులు మక్బుల్, సీపీఐ కౌన్సిల్ సభ్యులు సుధాకర్‌గౌడ్, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు శివ, గ్రామ శాఖ కార్యకర్తలు కిష్టయ్య, అంజయ్య, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

# ఈనెల 9నుంచి నామినేషన్ల స్వీకరణ

**–ఎన్నికల రిటర్నింగ్ అధికారి హిమబింధు**



చేవెళ్ల, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 07)ః ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ఈనెల 9నుంచి నామినేషన్ల స్వీకరణ ఉంటుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎంపీడీవో హిమబింధు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 9నుంచి 11వరకు నామినేషన్ల స్వీకరణ, 12నామినేషన్ల పరిశీలన, 13న నామినేషన్ల తిరస్కరణ అప్పీలు, 14 పరిష్కరణ, 15న నామినేషన్ల ఉపసంహరణ, పోటీ చేయూ అభ్యర్థుల జాబితా ప్రకటన, 23న ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ ఉంటుందని తెలిపారు.

## పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను పూర్తి చేయాలి : ఎంపీడీవో కుసుమ మాధురి



ఆమనగల్లు, మేజర్ న్యూస్ (అక్టోబర్ 07 ): త్వరలో జరగనున్న జెడ్పిటిసి, ఎంపీటీసీ, సర్పంచ్, ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను పర్యవేక్షించి పూర్తిచేయాలని ఎంపీడీవో కుసుమ మాధురి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.మంగళవారం మేడిగడ్డ, శంకర్ కొండ తండా లో పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ వెలుతురు రాంప్, టాయిలెట్స్, ఫాన్స్, లైట్స్ తదితర ఏర్పాట్లను పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆమె పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాలలో లోటు పాట్లు లేకుండా సిద్ధం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ వినోద, పంచాయతీ కార్యదర్శి జగన్ నాయక్, విజయ, ఫీల్డ్ అసిస్టెంట్స్, బి ఎల్ ఓ, అనగన్వాడీ కార్యకర్తలు, స్కూల్ టీచర్స్ పాల్గొన్నారు.

# వాల్మీకి మహర్షి జయంతి ఉత్సవాలను నిర్వహించిన నార్సింగి మున్సిపల్ అధికారులు



గండిపేట్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 07)ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను నార్సింగి మున్సిపల్ కార్యా లయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కమిషనర్ టి . కృష్ణమోహన్ రెడ్డి వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి పూజా కార్యక్రమాలను నిర్వహించారు ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ మున్సిపల్ కమిషనర్ నాగేంద్ర బాబు ,డి ఈ నరేష్ మేనేజర్ శ్రీనివాస్ ,ఏ ఈ శ్రీనివాస్, జేఏవో కృష్ణయ్య ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మీర్ పేట్ మున్సిపల్ కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలు

**"మహర్షి వాల్మీకి స్ఫూర్తితో జీవన విధానం నడపాలి.. కమిషనర్ నాగమణి"**



బాలాపూర్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 07): మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను కార్పొరేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు అర్పించి, నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ నాగమణి మాట్లాడుతూ.. మహర్షి వాల్మీకి సంస్కృత సాహిత్యంలో చిరస్మరణీయ స్థానాన్ని సంపాదించారు. రామాయణ మహాకావ్యాన్ని రచించి, ధర్మం, న్యాయం, సత్యం విలువలను ప్రజలకు బోధించారు. ఆయన శ్లోకాలు, కాండాలుగా ఉన్న రామాయణం మన జీవితాలకు మార్గదర్శకం అని ఆమె పేర్కొన్నారు. వాల్మీకి వంటి మహర్షుల బోధనలు నేటి సమాజంలోనూ ప్రతి ఒక్కరికి స్ఫూర్తినిస్తాయి. వారి ఆశయాల ప్రకారం జీవించడం నిజమైన జయంతి ఉత్సవం అని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ సంరెడ్డి నాగేందర్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి, వివిధ శాఖల అధికారులు, వార్డ్ ఆఫీసర్లు, కార్పొరేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. మహర్షి వాల్మీకి బోధనలను ఆచరణలోకి తెచ్చి సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని అధికారులు పిలుపునిచ్చారు.

# ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సులో స్పాట్ అడ్మిషన్లు




కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నీతాపోలె

ఫరూఖ్‌నగర్, మేజర్‌న్యూస్ (అక్టోబరు 07): షాద్‌నగర్ పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న గిరిజన గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ(ఐఎంఎస్‌సి) కోర్సులో చేరేందుకు స్పాట్ అడ్మిషన్‌ల కొరకై ధరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నీతాపోలె తెలిపారు. ఐదు సంవత్సరాల వ్యవది కలిగిన ఐఎంఎస్‌సి కోర్సులో చేరాలనుకునే విద్యార్థినులు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతతో పాటు సైన్స్ సబ్జెక్టులలో కనీసం 40 శాతం మార్కులు సాధించి ఉండాలన్నారు. గిరిజన గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో మొత్తం 38 మంది విద్యార్థినులకు ఐఎంఎస్ఏసి కోర్సులో చేరే అవకాశం ఉందని, ఇందులో ఎస్టీ బాలికలు 33, ఎస్సీ బాలిక 1, ఓసి 1, అనాథ విద్యార్థినులు 1, వికలాంగ బాలికలు 1, స్పోర్ట్ కోటా బాలికలు 1 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఐఎంఎస్‌సి కోర్సు పూర్తి చేసిన విద్యార్థినులు భవిష్యత్తులో ఫార్మా కెమికల్స్ ఇండస్ట్రీలలో ఉద్యోగావకాశాలు పొందవచ్చన్నారు. అంతేకాకుండా ప్రతిష్టాత్మక జాతీయ ఇనిస్టిట్యూషన్‌లలో విద్యార్థినులు ఇంటర్న్‌షిప్‌లు చేసే అవకాశం లభిస్తుందన్నారు. ఈ నెల 15 వ తేదీ లోపు విద్యార్థినులు తమకు సంబంధించిన సర్టిఫికెట్ల ప్రతులతో నేరుగా కళాశాలలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 9573021035, 7702516674 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపల్ సూచించారు.

# దాడిని నిరసిస్తూ న్యాయవాదుల విధుల బహిష్కరణ



ఆమనగల్లు, మేజర్ న్యూస్ (అక్టోబర్ 07 ): దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సిజెఐ పై దాడి చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ మంగళవారం పట్టణంలోని జూనియర్ కోర్టు ఆవరణలో ఆమనగల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సుప్రీంకోర్టులో సిజెఐ బిఆర్ గావాయ్ పై న్యాయవాది రాకేష్ కిషోర్ కాలి బూటుతో దాడికి యత్నించిన పరిమాణాన్ని తీవ్రంగా ఖండిస్తూ విధులను బహిష్కరించి కోర్టు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అండే కార్ యాది లాల్ మాట్లాడుతూ సిజెఐపై దాడిని ఖండిస్తూ చరిత్ర లో చీకటి రోజుగా భావిస్తున్నట్లు వివరించారు దాడికి పాల్పడ్డ న్యాయవాదిపై చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దుడ్డు ఆంజనేయులు, ఉపాధ్యక్షులు ఏర్పుల రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి విజయ్ కుమార్ గౌడ్, కోశాధికారి కొప్పు కృష్ణ, క్రీడా కార్యదర్శి శేఖర్, గ్రంథాలయ కార్యదర్శి వసుపుల మల్లేష్, న్యాయవాదులు జానకి రాములు, మధు గౌడ్, గణేష్ గౌడ్, దేవేందర్, జగన్ గౌడ్, ఆంజనేయులు, శేఖర్, మహేశ్వర్, శ్రీనివాస్, బీక్య నాయక్, శ్రీశైలం, ప్రభు తదితరులున్నారు.

# పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలి

- తోటకూర వజ్రేష్ యాదవ్
- ఎంసీపల్లి, అలియాబాద్

### కాంగ్రెస్ నూతన అధ్యక్షుల సన్మానం



**శామీర్‌పేట, మేజర్ న్యూస్ (అక్టోబర్,07):** మూడుచింతలపల్లి, అలియాబాద్ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు,మేడ్చల్ కాంగ్రెస్ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ సూచించారు. మంగళవారం మూడుచింతలపల్లి, అలియాబాద్ మున్సిపాలిటీలకు నూతన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఎన్నికైన ఉద్దమర్రి మాజీ సర్పంచ్ దోసకాయల వెంకటేష్, మజీద్‌పూర్ గ్రామానికి చెందిన తుంకి రమేష్‌లకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఇద్దరికీ శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ,.. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ప్రతి నిరుపేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు చేరేలా ఆరు గ్యారంటీ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. నూతన అధ్యక్షులు, కార్యకర్తలు ఈ పథకాలను గ్రామ స్థాయిలో ప్రజలకు వివరించి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుదీర్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్ పాల్గొని, నూతన అధ్యక్షులు దోసకాయల వెంకటేష్, తుంకి రమేష్‌లను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు తుంకి వెంకటేష్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, పట్టా బాల నర్సింహా, బస్వారెడ్డి, బండి జగన్నాధం, కటికల గోపి ముదిరాజ్, అఖిలేష్ రెడ్డి, దామోదర్ రెడ్డి, వీరేశం, లక్ష్మణ్ ప్రసాద్, వెంకట్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ జెండా ఎగరాలి...

### పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి



**పూడూర్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 07):** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ జెండా ఎగరాలని పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి కార్యకర్తలకు, నాయకులకు సూచించారు.అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రాకంచెర్ల కాటన్ మిల్లులో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. నాయకులు కార్యకర్తలు సమన్వయంతో పనిచేసే జడ్పిటిసి, ఎంపీటీసీ,సర్పంచులు అధిక సంఖ్యలో బిఆర్ఎస్ అభ్యర్థులు గెలవాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.మండల కేంద్రంలోని పెద్ద ఉమెన్తాల్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే సమక్షంలో బిఆర్ఎస్ లో చేరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే రెండేళ్లు కావస్తున్న అభివృద్ధి మాత్రం శూన్యమని అన్నారు.కాంగ్రెస్ నాయకులు గాలి మాటలు అద్దాలమేడలు చూపిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు.స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ హామీలను ఎండగట్టి బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. అధికార కాంగ్రెస్ పార్టీ ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిందని అన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ అన్యాయాలను అక్రమాలను ఎండగట్టాలని తెలిపారు.గత బిఆర్ఎస్ పాలనలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలు చేపట్టినట్లు తెలిపారు.ప్రతి కార్యకర్తకు బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. టిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను అధిక సంఖ్యలో గెలిపించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అనిల్ రెడ్డి,సీనియర్ నాయకులు మాజీ కోఆప్షన్ సభ్యులు అజీముద్దీన్, మాజీ సొసైటీ చైర్మన్ నరసింహారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ అజారుద్దీన్, సీనియర్ నాయకులు రామ్ రెడ్డి, బుచ్చిరెడ్డి, రామచంద్రారెడ్డి, ప్రభాకర్ గుప్తా, వెంకటయ్య, రాజేందర్,బిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు రాయిస్ అహ్మద్ ఖాన్,మాజీ సర్పంచులు బుచ్చన్న, దయాకర్,వినోద్ గౌడ్, భాస్కర్ రెడ్డి,యువ నాయకులు ప్రవీణ్, నరసింహ, పాండు,రామ్ గోపాల్, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మహర్షి వాల్మీకి కవి మాత్రమే కాదు... ఒక యుగపురుషుడు

- జిల్లా ఎస్పీ కే. నారాయణ రెడ్డి
- ఎస్పీ ఆఫీసులో శ్రీ మహర్షి వాల్మీకి

### జయంతి వేడుకలు



వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (అక్టోబర్ 07):శ్రీ మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించు కొని మంగళవారం వికారాబాద్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు ఎస్పీ కె.నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, మహర్షి వాల్మీకి గారి చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేక నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ నారాయణ రెడ్డి మాట్లాడుతూ....,

శ్రీ మహర్షి వాల్మీకి కేవలం ఒక కవి మాత్రమే కాదని, ఆయన ఒక యుగ పురుషుడని కొనియాడారు. “ఆది కవిగా ప్రసిద్ధి చెందిన మహర్షి వాల్మీకి రచించిన ‘రామాయణం’ కేవలం ఒక ఇతిహాసం కాదు, అది సత్యం, నీతి, ధర్మం, కర్తవ్యం వంటి మానవ విలువలకు అద్దం పడుతుందన్నారు. ఈ పవిత్ర గ్రంథం అనాదిగా సమాజంలో సత్యం, న్యాయం, సమానత్వం స్థాపనకు ప్రేరణగా నిలుస్తుంది,” అని తెలిపినారు.

ప్రజలకు సేవ చేస్తూ బాధ్యతాయు తమైన జీవనం గడపడానికి, నిస్వార్థ సేవకు వాల్మీకి మహర్షి ఆశయాలే మనకు మార్గదర్శకమని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ బి.రాములు నాయక్, ఏవో ఖాజ ఖాయిమోద్దీన్ స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ డి.వి.పి. రాజు, ఆర్ఐలు డేవిడ్, అంజాత్ పాషా గర్లుతో పాటు పలువురు ఎస్సైలు, పోలీసు సిబ్బంది మరియు కార్యాలయ అధికారులు, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

### చికెన్ వ్యర్థాలతో దుర్గంధం..

# ప్రజలకు ఇబ్బందులు

- డబిల్‌పూర్-మైసిరెడ్డిపల్లె రోడ్డుపై విచ్చలవిడిగా చెత్త పారవేత



**మేడ్చల్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 07):** ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని డబిల్‌పూర్ గ్రామం నుండి మైసిరెడ్డిపల్లెకు వెళ్లే రహదారిపై చికెన్ షాపుల వ్యర్థాలను విచ్చలవిడిగా పారవేయడం ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది.ఆ మార్గం గుండా వెళ్లే వాహనదారులు దుర్వాసనతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. రహదా రి పక్కన పడేసిన చికెన్ చెత్త కారణంగా కుక్కలు, పందులు చేరి వాహనదారులను, పాదచారులను కరవడానికి ప్రయత్నిస్తున్నాయి అని స్థానికులు వాపోతున్నారు.అలాగే రోడ్డు పక్కనే ఉన్న బావిలో చికెన్ వ్యర్థాలను వేయడం వల్ల నీరు తీవ్రంగా కలుషితమై కంపు కొడుతోంది. దాని వలన చుట్టుపక్కల ప్రాంతంలో అసహనకరమైన దుర్గంధం వ్యాపించి, ప్రజలు ఆ మార్గంలో ప్రయాణించలేకపోతున్నారని కొనాయిపల్లి, మైసిరెడ్డిపల్లి గ్రామస్థులు తెలిపారు. గ్రామ ప్రజలు మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి, చికెన్ షాపుల వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## మాణెమ్మ పార్థివదేహానికి నివాళ్లు అర్పించిన ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం నరేందర్ రెడ్డి



పెద్దెముల్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 07)ః పెద్దేముల్ మండల్ గాజీపూర్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు మాజీ పశుగానాభివృద్ధి సంస్థ చైర్మన్ నారాయణ రెడ్డి సతీమణి మణెమ్మ పార్థివాదేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించిన తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి. మణెమ్మ మృతి పట్ల తన ప్రగాఢ సానుభూతి తెలిపి కుమారులు పి. వేణుగోపాల్ రెడ్డి,రాంచంద్రారెడ్డి రెడ్డి లకు మనోధైర్యం తెలిపారు. ఆయనతో పాటు రాష్ట్ర టీపీసీసీ ప్రచార సమన్వయకర్త కరణం పురుషోత్తం రావు, డీసీసీబీ వైస్ చైర్మన్ రవీందర్ గౌడ్,మారేపల్లి మాజీ సర్పంచ్ పట్లోళ్ళ బల్వంత్ రెడ్డి,కోట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, పిఎసిఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ జ్ఞానేశ్వర్ పటేల్,మాజీ సర్పంచ్ నక్కల బంధయ్య, శివానందం ఆజ నర్సిములు,మాజీ వైస్ ఎంపీపీ గొల్ల లక్ష్మణ్, డాక్టర్ ప్రభాకర్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ గేమ్య నాయక్, మాజీ సర్పంచ్ మధు,బిర్కెట్ రఘు, శివానంద్ మడపతి, అయ్యుబ్ ఖాన్, సిద్ధూ అయ్యా మరియు తదితరులు పాల్గొన్నారు.

### ముత్యాలమ్మ దేవస్థానానికి కొత్త విద్యుత్ మీటర్ మంజూరు సిఫార్సు

- దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్ రెడ్డి సూచనతో ట్రాన్స్‌కో అధికారులకు లేఖ

**కీసర,మేజర్ న్యూస్ (అక్టోబర్ 7):** చీర్యాల గ్రామంలోని శ్రీ ముత్యాలమ్మ దేవస్థానంకు కొత్త విద్యుత్ మీటర్ మంజూరు చేయాలని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్ రెడ్డి సిఫార్సు చేశారు. ఈ మేరకు కమిషనర్ కీసర ట్రాన్స్‌కో సహాయ కార్యనిర్వహణ ఇంజనీరు కు అధికారిక లేఖ పంపించారు.చీర్యాల గ్రామ మాజీ సర్పంచ్ తుంగ ధర్మేందర్ సమర్పించిన లేఖకు అనుసంధానంగా దేవాలయ కమిటీ తమ పేరుతో కొత్త విద్యుత్ మీటర్ మంజూరు చేయవలసిందిగా అభ్యర్థించిందని కమిషనర్ తెలిపారు.

# ఏటీసీ సెంటర్‌లో పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలి : కలెక్టర్ మను చౌదరి

- సదుపాయాలు, బోధన నాణ్యతపై

**ఆల్వాల్ ఐటీఐలో కలెక్టర్ పరిశీలన**



ఏటీసీ సెంటర్‌లో మిషనరీ, తరగతి గదులను పరిశీలిస్తున్న కలెక్టర్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి,మేజర్ న్యూస్ (అక్టోబర్, 07):** జిల్లాలోని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో పెండింగ్‌లో ఉన్న పనులను తక్షణమే పూర్తి చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆల్వాల్‌లోని ఐటీఐ కాలేజీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నూతన ఏటీసీ (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్)ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెంటర్‌లో ఇంకా పూర్తికాని ఏసీ ఫిట్టింగ్, కంప్యూటర్ ఇన్‌స్టాలేషన్ వంటి పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ సెంటర్‌లోని మిషనరీ, తరగతి గదులు, ప్రయోగశాలలు పరిశీలించారు. అక్కడ బోధన సిబ్బందితో మాట్లాడి, మొత్తం విద్యార్థుల సంఖ్య, ట్రేడ్ల వారీగా విద్యార్థుల వివరాలు తెలుసుకున్నారు. ఒక్కో ట్రేడ్‌లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు, వారికి సరిపడా బోధన సిబ్బంది ఉన్నారా అని ఆరా తీశారు. టెక్నాలజీ కోర్సులలో ప్రాక్టికల్, థియరీ క్లాసులు సక్రమంగా నిర్వహిస్తున్నారా అని విచారించారు.



ఈ సందర్భంగా బోధన సిబ్బంది వర్క్‌షాప్ రూఫ్ లీకేజీ సమస్య, పారిశుద్ధ్య సిబ్బంది కొరతలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్ మను చౌదరి వెంటనే స్పందిస్తూ, సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో డివో శేఖర్ రెడ్డి, సూపరింటెండెంట్ శైలజ, బోధన సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానికంగా ఉండే నాయకులకే మా ఓట్లు

- మంచాల మండల ప్రజల తీర్పు ఎటువైపు..?

**మంచాల, మేజర్ న్యూస్ (అక్టోబర్ 07):**
ఎన్నికల్లో గెలిచి.. స్థానికంగా ఉండి ప్రజల సమస్యల కోసం పనిచేసే నాయకుడినే గెలిపించుకోవాలని ఆలోచనలో మండల ప్రజలు ఉన్నట్లు తాజా సమాచారం.. పదవి వచ్చినంక స్థానికంగా ఉండక..పదవి మండలం..పయణం పట్టణం.. మా సమస్యలు తీర్చేవారు ఎవరు.. అనే కోణంలో ప్రజలు చాలా ఆసక్తికరంగా.. ఆలోచన చేస్తున్నట్లు సమాచారం..ఏ పార్టీ నాయకుడు అయినా సరే మా సమస్యలు తీర్చే నాయకుడు కావాలి అని వివిధ గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. గత 15 రోజుల క్రితం యూరియా బస్తాల కోసం పగలు, రాత్రి అనక , నరకయాతన చూసామని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏ పార్టీ నాయకుడు అయినా సరే మా సమస్యలు పరిష్కరించాలి. మా గ్రామాల అభివృద్ధి కోసం పాటుపడాలి. అటువంటి నాయకుడిని ఎన్నుకునే ఆలోచనలో మండల ప్రజలు ఉన్నట్లు తాజా సమాచారం. ప్రజల తీర్పు ఎటు వరిస్తుందో వేచి చూడాల్సిందే..

★ **ముమ్మరంగా ఎన్నికల ప్రక్రియ..**




మండలంలో ఒక జెడ్పీటీసి, 13 ఎంపీటీసీ స్థానాలు ఉండగా 75 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించనుంది. మండలంలో 39920 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వారిలో 20477 మంది పురుషులు, 19443 మహిళా ఓటర్లు ఉన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన దృష్ట్యా మండల వ్యాప్తంగా ఎన్నికల పనులు ఊపందుకున్నాయి. సంబంధిత అధికారులు ఎన్నికల ప్రక్రియను ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులో బాగంగా రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. కాగా.. రిజర్వేషన్ల అంశంపై నేడు హైకోర్టు వెల్లడించే తీర్పు కోసం అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఎదురుచూస్తున్నారు.

# ఆలస్యంగా వచ్చారని గేటు బయటే విద్యార్థులు

- గురుకుల ముందు విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన



పాఠశాల గేటు ముందు వేచియున్న విద్యార్థులు

**కొడంగల్, మేజర్ న్యూస్ (అక్టోబరు 7):** పాఠశాలకు ఆలస్యంగా వచ్చారని విద్యార్థులను గురుకుల పాఠశాలలోకి రానివ్వని సంఘటన కొడంగల్‌లో చోటు చేసుకుంది. దసరా సెలవుల్లో ఇళ్లకు వెళ్లిన విద్యార్థులు సోమవారం రావాల్సి ఉండగా ఒక్కరోజు ఆలస్యంతో మంగళవారం వచ్చారు. కొడంగల్ పట్టణ శివారులోని తాండూర్ మార్గంలో గల దౌల్తాబాద్ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి మంగళవారం పాఠశాలకు రాగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు వేచి ఉన్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ విలేకరులకు సమాచారం అందించారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్, సిబ్బందితో మాట్లాడగా విద్యార్థులను మధ్యాహ్నం 12:30 తర్వాత పాఠశాలలోకి రానిచ్చారు. సెలవుల్లో బ్యాంకు అకౌంట్, ఆధార్ అప్‌డేట్ చేసుకొని పాఠశాలకు రావాలని ఉపాధ్యాయులు తెలపడంతోనే ఆలస్యమైందని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. ఒక్క రోజు ఆలస్యమైతే పాఠశాలలోకి రానివ్వకపోవడం ఏంటనీ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌తో వివరణ కోరగా ఆర్‌సీవో ఆదేశాలను పాటించాల్సి ఉంటుందని సమాధానం ఇచ్చారు. పాఠశాల గేటు ముందు విద్యార్థుల పడిగాపుల విషయంపై సంబంధిత ఆర్‌సీవోను వివరణ కోరగా సరైన సమాధానం ఇవ్వకుండా దాట వేశారు.



పాఠశాల సిబ్బందితో వాగ్వావాదం చేస్తున్న విద్యార్థుల తల్లి దండ్రులు

# ఆదివాసీ ఆత్మగౌరవానికి ప్రతీక కొమరం భీం అధికారుల నివాళులు

- గిరిజన హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన మహా నాయకుడిని స్మరించిన అధికారులు



కొమరం భీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధికారులు..

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (అక్టోబర్ 7):** జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొమరం భీం వర్ధంతి కార్యక్రమం మంగళవారం మేడ్చల్ జిల్లా గిరిజన సంక్షేమ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు కొమరం భీం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన త్యాగస్ఫూర్తి, పోరాట చరిత్రను స్మరించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, కొమరం భీం ఆదివాసీల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసి ప్రాణత్యాగం చేసిన మహానాయకుడు. ఆయన చూపిన మార్గం నేటికీ సమాజానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. గిరిజన సమాజ అభివృద్ధి కోసం ఆయన బోధనలు మార్గదర్శకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి పద్మజ, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి వినోద్ కుమార్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి టి. ఝాన్సీ రాణి, శాఖ సిబ్బంది సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాద బరితంగా డబుల్‌రోడ్డు మలుపులో కంపచెట్లు

- మాడ్గుల – ఆమనగల్లు డబుల్‌రోడ్డులో అవురుపల్లి పోచమ్మ గుడి మలుపు వద్ద ప్రమాదబరితంగా మారిన కంపచెట్లు, పిచ్చిమొక్కలు
- మూలమలుపు వద్ద ఎదురెదురు వాహనాలు కనిపించపోవడంతో తరుచూ ప్రమాదాలు
- ఆర్ అండ్‌బి అధికారులు స్పందించి డబుల్‌రోడ్డు పక్కన కంపచెట్లు తొలగింప జేయాలంటున్న వాహనదారులు



డబుల్‌రోడ్డు పక్కన మలుపువద్ద ప్రమాదబరితంగా కంపచెట్లు, పిచ్చిమొక్కలు

**మాడ్గుల, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 07):** మాడ్గుల మండలం అవురుపల్లి పోచమ్మ గుడి సమీపంలోని మూలమలుపు వద్ద ఆమనగల్లు- మాడ్గుల డబుల్‌రోడ్డు పక్కన కంపచెట్లు, పిచ్చిమొక్కలు ప్రమాదబరితంగా మారాయి. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారి నిర్వాహణ అంతంత మాత్రంగా వుండగా పోచమ్మ దేవాలయ సమీపంలోని మూలమలుపు నుండి నల్లవారిపల్లి గేట్ వరకు డబుల్‌రోడ్డు ప్రక్కన కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగి ఎదురెదురు వాహనాలు కనిపించకుండ మారాయి.దీంతో ఈ రహదారిపై ప్రయాణించే వాహనదారులు, ప్రయాణీకులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ఆర్ అండ్ బి శాఖ అధికారులు వెంటనే స్పందించి డబుల్‌రోడ్డు పక్కన ప్రమాదకరంగా మారిన కంపచెట్లు, పిచ్చిమొక్కలు తొలగింపజేయాలని స్థానికులు కోరుతున్నారు.

సూర్య
www.suryaa.com



## సత్యం-ధర్మానికి మార్గదర్శకుడు వాల్మీకి మహర్షి : మున్సిపల్ కమిషనర్ వెంకట్ రెడ్డి



కీసర,మేజర్ న్యూస్ (అక్టోబర్, 7):
ఆదికవి రామాయణ రచయిత మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు మంగళవారం దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. వాల్మీకి మహర్షి చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ వెంకట్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, "మహర్షి వాల్మీకి చూపిన సత్యం, ధర్మం, న్యాయం మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శం. ఆయన రచించిన రామాయణం మనకు జీవిత సత్యాలను, మానవతా విలువలను బోధించే శాశ్వత గ్రంథం" అని పేర్కొన్నారు. "మహర్షి చూపిన మార్గం సమాజానికి నిత్య ప్రేరణగా నిలుస్తుంది" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు రామిడి విజయ్ రెడ్డి, డీ.ఈ.ఈ. ఎస్. బాలమురళి, మున్సిపల్ సిబ్బంది ఇతర అధికారులు పాల్గొని మహర్షికి నివాళులు అర్పించారు.

## ఘనంగా కొమరంభీమ్ వర్ధంతి



వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (సెప్టెంబర్ 07): కొమురంభీమ్ వర్ధంతి సందర్భంగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశం హాలు నందు ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.మంగళవారం ఐడీఓసి నందు ఏర్పాటు చేసిన కొమురం భీమ్ 65వ వర్ధంతి సందర్భంగా అయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, డిఆర్ఓ మంగీ లాల్, డిటిడిఓ కమలాకర్ రెడ్డి, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పిఎన్పిఎస్ ఆధ్వర్యంలో గ్రూప్ 1 ఉద్యోగికి సన్మానం...



మారుతిని సన్మానిస్తున్న రాఘవేందర్ గౌడ్

కుల్కచర్ల రూరల్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 07)
కుల్కచర్ల మండల పరిధిలోని తిరుమలాపూర్ గ్రామవాసి మారుతికి గ్రూప్1 ఉద్యోగ రావడం చాలా అభినందనీయం అని పరిగి నియోజకవర్గ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ అన్నారు. మంగళవారం తన నివాసంలో మారుతిని ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా పరిగి నియోజకవర్గ పరిరక్షణ సమితి రాఘవేందర్ గౌడ్ మాట్లాడుతూ... మారుమూల ప్రాంతం నుండి గ్రూప్ వన్ ఉద్యోగం సాధించడం అభినంద నీయం అన్నారు. నేటి యువత మారుతిని ఆదర్శంగా తీసుకొని చదవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఘనపూర్ బీజారం రామచంద్రయ్య, చీపిరి రాములు, శశిధర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మోహన్ నాయక్, అబ్దుల్, రాజేందర్ రెడ్డి, బాలకృష్ణ, సత్తయ్య, మారుతి, తల్లిదండ్రులు ఆంజనేయులు పద్మమ్మ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీనివాసపురంలో జనరంజకంగా సాగిన పౌరాణిక పద్య నాటకం

వనస్థలిపురం,మేజర్‌న్యూస్:శ్రీ దేవీ నవరాత్రుల వరవడిని పురస్కరించుకొని బి.ఎన్.ఆర్ ( బాబు ) ఆర్ట్స్ వారిచే తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ వారి సహకారంతో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, శ్రీ విజయదుర్గ మహిళా మండలి వెల్ఫేర్ అసోసియేషన్ శ్రీనివాసపురం వారి సహాయ సహకారాలతో వనస్థలిపురం శ్రీనివాసపురం వెల్ఫేర్ అసోసియేషన్ కళా ప్రాంగణంలో శ్రీ కృష్ణ రాయభారం పౌరాణిక పద్య నాటక ప్రదర్శన జరిగింది. సెప్టెంబర్ 25 వ తేదీ గురువారం సాయంత్రం విశేషంగా హాజరైన ప్రేక్షకుల మధ్య జరిగిన ఈ నాటక ప్రదర్శన ఆద్యంతం ఆహుతులను అలరించింది. నాటక ప్రదర్శనలో శ్రీ కృష్ణుడుగా ఏటూరి హరినాద్, అర్జునుడుగా మట్టపర్తి నమఃశివాయ, దుర్యోధనుడుగా సిహెచ్. బాలనాగేశ్వర్‌రావు, ధర్మరాజుగా సిహెచ్.బి.ఎన్ రావు, భీముడుగా వి. సూర్యప్రకాష్, నకులుడుగా వి.ఎల్. నరసింగరావు, సహదేవుడుగా సిహెచ్.వి.ఆర్.కె మూర్తి, సాత్యకిగా వి.బి.జి తిలక్ లు నటించి మెప్పించారు. స్వర్గీయ తిరుపతి వెంకటకవులు మూల రచన చేసిన ఈ నాటక ప్రదర్శనకు రంగస్థల అనుసరణ, కూర్పు, దర్శకత్వం వి. సూర్యప్రకాష్ వహించారు. సిహెచ్‌బిఎన్ రావు నిర్వహణ, సిహెచ్‌విఆర్‌కె మూర్తి సహకారం అందించారు. ఎస్. భాస్కర్‌రావు హార్మోనియం, పవన్ డోలక్, పరమేష్ అండ్‌పార్టీ మేకప్, సురేష్ వీడియో, నాగరాజు రంగోద్దీపనం చేయగా ఎల్. బుగ్గయ్య, వి.పి.కె బసవయ్యలు సహకారం అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కళాకారులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.

## దుస్తులను విరాళంగా ఇద్దాం దీపావళిని అర్థవంతంగా చేద్దాం

**వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన గీతం స్టూడెంట్ లైఫ్ డైరెక్టరేట్**

హైదరాబాద్, మేజర్ న్యూస్ ప్రతినిధి:
ఇవ్వడంలో ఆనందం ఉందని, దుస్తులను విరాళంగా ఇవ్వడం ద్వారా ఈ దీపావళిని అర్థవంతంగా, స్ఫూర్తిదాయకంగా మారుద్దామని హైదరాబాదు, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్ పిలుపునిచ్చింది. శ్రేయస్సు కోసం దుస్తుల అలమార (వార్డ్ రోబ్ ఫర్ వెల్ నెస్) ఇతివృత్తంగా, స్టూడెంట్ లైఫ్ డైరెక్టరేట్ ఆలోచనాత్మక దుస్తుల విరాళ కార్యక్రమం ద్వారా కాంతి, ఆశను వ్యాప్తి చేయడానికి విద్యార్థులను వారి హృదయాలను, దుస్తుల అలమార (వార్డ్ రోబ్)లను తెరవమని ఆహ్వానిస్తోంది. వస్త్రనోవా, చరైవేతి అనే రెండు ఉత్సాహభరితమైన విద్యార్థి క్లబ్ ల సహకారంతో, ఈ కార్యక్రమాన్ని అక్టోబరు 7 నుంచి 9వ తేదీ వరకు గీతం ప్రాంగణంలోని కేఫ్ కనెక్షన్స్ లో నిర్వహిస్తున్నారు. తమ సున్నితమైన దుస్తులను %-% చొక్కాలు, జాకెట్లు, లేదా మరొకరికి ఓదార్పు, గౌరవాన్ని తీసుకురాగల ఏదైనా వస్త్రాలను దానం చేయమని గీతం విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. 'ప్రతి వస్త్రం ఒక కథ చెబుతుంది %-% దానిని పంచుకున్నప్పుడు, అది వేరొకరి జీవితంలో వెచ్చదనాన్ని ఇస్తుంది' అని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు. 'ఈ దీపావళికి దయను ట్రెండ్ గా మార్చి, అర్థవంతంగా చేద్దాం %-% ప్రకాశాన్ని వ్యాప్తి చేద్దాం' అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా సానుభూతి, సమాజ సంరక్షణ, స్థిరమైన జీవన సంస్కృతిని గీతం పెంపొందించడంతో పాటు కరుణామయ చర్యల ద్వారా ప్రకాశవంతమైన దీపాలను వెలిగించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తోంది.

## 732 ఫార్మసీ ఆఫీసర్స్ ప్రొవిజినల్ మెరిట్ లిస్ట్ విడుదల చేయాలి

హిమాయత్ నగర్, మేజర్ న్యూస్ : మెడికల్, హెల్త్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డు చైర్మన్ గోపి కాంత్ రెడ్డి ను మంగళవారం తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ బత్తిని సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో కలిసి 732 ఫార్మసీ ఆఫీసర్స్ పోస్ట్స్ ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ విడుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయనకు వినతి పత్రం అందజేసి సమస్యలపై దాదాపు ఒక గంట సమయం చర్చించారు. కోర్ట్ నుండి ఎటువంటి స్టే ఇవ్వనందున వెంటనే రిజల్ట్ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ .. డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ నుండి పూర్తి నివేదిక రాగానే ప్రభుత్వానికి పంపించి, అక్కడ నుంచి పర్మిషన్ తీసుకుని కోర్ట్ కు సబ్మిట్ చేసి రిజల్ట్ ప్రకటిస్తామని అన్నారు.ఈ కార్యక్రమం లో స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కందకట్ల శరత్ బాబు, స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ జాలిగామ అశోక్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఏ. వి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకి జయంతి వేడుకలు




వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (సెప్టెంబర్ 07):
మంగళవారం మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ "మహర్షి వాల్మీకి మన దేశానికి ఆదర్శప్రాయమైన కవి, ఆధ్యాత్మిక గురువుగా నిలిచారు. ఆయన రామాయణాన్ని రచించి సత్యం, ధర్మం, న్యాయం, నిష్కామ సేవ వంటి విలువలను సమాజానికి చాటిచెప్పారు. ఆయన చూపిన మార్గంలో నడిచి ప్రతి ఒక్కరూ నిజాయితీ, నిబద్ధతతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు లింగ్యా నాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, డి ఆర్ ఓ మంగీ లాల్, బి సి వెల్ఫేర్ అధికారి మాధవ రెడ్డి, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మనిషి నుండి మహర్షిగా మారిన వాల్మీకి జీవితం అందరికీ ఆదర్శ ప్రాయం...

● బీజేపీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జూంటీ పల్లి వెంకటేష్ వెల్లడి



తాండూరు, మేజర్ న్యూస్ (అక్టోబర్ 07):మనిషి నుండి మహర్షిగా మారిన వాల్మీకి జీవితం అందరికీ ఆదర్శ ప్రాయం అని బీజేపీ పార్టీ వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి జూంటీ పల్లి వెంకటేష్ పేర్కొన్నారు. బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నాడు జరిగిన వాల్మీకి జయంతి కార్యక్రమంలో మహిళాఅధ్యక్షురాలు హైమ రెడ్డి, మాజీ యువ మోర్చా రాష్ట్ర నేత విక్రమ్ రెడ్డి, తదితరులతో కలిసి వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ...మనిషి నుండి మహర్షిగా మారి యుగాల నుండి తర తరాలకు ఆదర్శ ప్రాయులుగా నిలిచిన మహోన్నత మహర్షిని నేడు ప్రతి ఒక్కరు వారి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ నేత సుదర్శన్ గౌడ్, నేతలు విజయ్ కుమార్, గోపాల్, లాలయ్య, కుర్వ జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

## ఎంబీబీఎస్‌లో సత్తాచాటిన ఆదిత్యవర్ధన్

**ఆదిత్య వర్ధన్ అభినందించిన ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**



యాలాల, మేజర్ న్యూస్ (అక్టోబర్ 07): మండలం ప్రభుత్వ గురుకులాల్లో చదివి ఈ మధ్యే జరిగిన నీట్‌లో ఉత్తమ ర్యాంక్ సాధించి కామినేని మెడికల్ కళాశాలలో ఫ్రీ ఎంబీబీఎస్ సీటు సాధించిన యాలాల మండలం బండమీదిపల్లి గ్రామానికి చెందిన బషీరాబాద్ సాక్షి విలేకరి నర్సిములు,పద్మ దంపతుల కొడుకు ఆదిత్య వర్ధన్ ను తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి శాలువ పూల మాలతో ఘనంగా సన్మానించారు.మంగళవారం తాండూరు పట్టణంలోని వారి నివాసానికి ఎమ్మెల్యే కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్,కుమార్ ధారాసింగ్ మురళి కృష్ణ,మాధవ రెడ్డి బాల్ రెడ్డి , నర్సిములు,చందర్, ఉదయ్ భాస్కర్ తో కలిసి వెళ్లారు.ఈ సందర్భంగా ఆదిత్యతో ముచ్చటించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ గురుకులాల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని చెప్పడానికి ఆదిత్య సాధించిన ఎంబీబీఎస్ సీటు నిదర్శనం అన్నారు.ఈ సందర్భంగా ఆదిత్య తల్లిదండ్రులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రపంచం ముందు దేశ పరువు పోతుంది

### బీఎస్పీ రంగారెడ్డి జిల్లా ఇంచార్జి దొడ్డి శ్రీనివాస్



షాద్‌నగర్, మేజర్‌న్యూస్ (అక్టోబరు 07): పేద వర్గాల వారు ఉన్నత పదవుల్లో ఉండటాన్ని జీర్ణించుకోలేని కొందరు కుట్రపూరితంగా వ్యవహరిస్తూ వారు చేసే పనుల ద్వారా ప్రపంచ దేశాల ముందు భారతదేశ పరువు పోతుందని బీఎస్పీ రంగారెడ్డి జిల్లా ఇంచార్జి నాయకుడు దొడ్డి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సుప్రింకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాన న్యాయమూర్తిపై దాడి వెనక ఇతరుల హస్తం ఉందని వారిని గుర్తించి క ఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా న్యాయవాది రాకేశ్ కిషోర్‌ను దేశంలోని కోర్టులలో ప్రాక్టిస్ చేయకుండా నిషేదిస్తూ సస్పెండ్ చేయడాన్ని శభపరిణామన్నారు.

## గ్రూప్-2 విజేత శివమణికి సన్మానం



చేవెళ్ల, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 07)ః గ్రూప్-2 విజేతగా నిలిచిన శివమణిని మంగళవారం చేవెళ్ల వివేకానంద కళాశాల ప్రిన్సిపల్, యాజమాన్యం శాలువతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.... వివేకానంద కళాశాలలో 2016-18సంవత్సరంలో సీఈసీలో శివమణి ఉత్తమ మార్కులు సాధించి జిల్లా టాఫర్‌గా నిలిచారని, రాష్ట్రంలో 7వ ర్యాంకు సాధించారన్నారు. గ్రూప్-2 విజేతగా నిలవడం తమ కళాశాలకు ఎంతగానో సంతోషంగా ఉందన్నారు. మొయినాబాద్ మండలం నక్కలపల్లి గ్రామానికి చెందిన శివమణికి తల్లి లేకపోవడంతో ఆర్థిక కష్టాలను ఎదుర్కొని చదివే లక్ష్యంగా పెట్టుకుని గ్రూప్-2 విజేతగా నిలబడ్డాడని తెలిపారు. విద్యార్థులు శివమణిని ఆదర్శంగా తీసుకుని వివిధ రంగాల్లో విజేతలుగా నిలవాలని సూచించారు.

## ప్రమాదవశాత్తు గిరిజన బాలుర ఆశ్రమపాఠశాల ఫైళ్ళు, రికార్డులు దగ్ధం



కడ్తాల్, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 07): కడ్తాల్ మండలం మైసిగండి గ్రామంలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల గదిలో భద్రపరిచిన ఫైళ్ళు, రికార్డులు మంగళవారం ఉదయం 9గంటల15 నిమిషాల సమయంలో ప్రమాదవశాత్తు దగ్ధమైనట్లు ఆశ్రమపాఠశాల వసతి గృహ సంక్షేమాధికారి వన్నాడ బాల్‌రాజ్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదుచేసినట్లు కడ్తాల్ సి.ఐ గంగాధర్ తెలిపారు. ఈసందర్భంగా ఆశ్రమపాఠశాల గదిలో భద్రపరిచిన రంగారెడ్డి, హైద్రాబాద్ జిల్లాలకు సంబంధించిన ఉపకారవేతనాల మ్యాన్యువల్స్, ఆన్‌లైన్ స్పైరల్ బైండింగ్ హార్డ్ కాపీలు, 1982 నుండి 2015 వరకు సంబంధించిన ఫైళ్ళు, రికార్డులు దగ్ధమైనట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొనడం జరిగిందని, ఈ మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సి.ఐ గంగాధర్ వివరించారు.

## కేశంపేట మండలంలో పోలీసులు, అధికారుల కవాతు



కేశంపేట, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 07): కేశంపేట మండలంలోని కాకునూరు, కొండారెడ్డిపల్లి గ్రామాల్లో మంగళవారం సాయంత్రం పోలీసులు అధికారులు, మండల పరిషత్ అధికారులు ఎన్నికల కోడ్ సందర్భంగా కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ నరహరి, ఇంచార్జ్ ఎంపిడిఓ రవిచంద్రకుమార్‌రెడ్డిలు ఎన్నికల నియమ, నిభంధనలను ప్రజలకు వివరించి ఎన్నికల సమయంలో అధికారులకు ప్రజలు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజ్‌కుమార్, ఎంపిఓ కిష్టయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తాం : జిల్లా వ్యవసాయ అధికారిని ఉష



ఆమనగల్లు, మేజర్ న్యూస్ (అక్టోబర్0 7 ): ఫర్టిలైజర్స్ దుకాణాల యజమానులు రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారిణి ఉషా హెచ్చరించారు. మంగళవారం పట్టణ కేంద్రంతో పాటు మండలంలోని ఫెర్టిలైజర్ దుకాణాలను ఏడిఏ శోభారాణి, ఏవో శ్రీనివాస్ గౌడ్ లతో కలిసి జిల్లా వ్యవసాయ అధికారినీ ఉషా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫర్టిలైజర్స్ డీలర్స్ రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, పురుగు మందులకు,బిల్లులు ఇవ్వాలనీ సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. ఫర్టిలైజర్స్ దుకాణాల యజమానులు రిజిస్టర్ మెయింటెనెన్స్ చేసి ధరల పట్టికను రైతులకు కనబడే విధంగా ఏర్పాటు చేయాలని ఆమె పేర్కొన్నారు.

## మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించిన తెలంగాణ పోలీస్ అకాడమి



గండిపేట్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 07) ఆర్.బి.వి.ఆర్.ఆర్. తెలంగాణ పోలీస్ అకాడమిలో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అకాడమి డైరెక్టర్ అభిలాష్ బిస్త్ ఐ.పి.ఎస్ మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ ఎన్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ. ధర్మో రక్షతి రక్షితః అని మనం ధర్మాన్ని కాపాడితే ధర్మం మనల్ని కాపాడుతుంది అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రామాయణం చదవాలని, అందులోని ఆధ్యాత్మికత నీతి, జీవన విలువలను అర్థం చేసుకొని ఆచరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, కే ఆర్ కే ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట రావు, కే. నరహరి, పి సి వి రమణ, భరత్, నాగేశ్వరరావు, డిఎస్పిస్ సతీష్ కుమార్, సందీప్ రెడ్డి, ఎన్. రామారావు, ఏ. తిరుపతి, కె. యాదమ్మ (ఎ.ఓ) అకాడమి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నాగిల్లలో 5 మేకలు అపహరించిన గుర్తుతెలియని దొంగలు



మాడ్గుల, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 07): మాడ్గుల మండలం నాగిల్ల గ్రామంలో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగలు ప్రవేశించి ఇదే గ్రామానికి చెందిన ఇద్దరు మేకల పెంపకందారులకు చెందిన 3 మేకలు, రెండు మేకపోతులను అపహరించుకపోయినట్లు స్థానికులు తెలిపారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం నాగిల్ల గ్రామానికి చెందిన కొండ్రెడ్డి పోచయ్యకు సుమారు 30వరకు మేకలు ఉండగా వాటిని తన ఇంటి ఆవరణలోనే ఏర్పాటుచేసుకున్న షెడ్డులో ఉంచగా సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగలు పోచయ్య మేకల షెడ్డులోకి ప్రవేశించి 3మేకలు, ఒక మేకపోతును అపహరించుకుపోయినట్లు స్థానికులు తెలిపారు. అదేవిధంగా పోచయ్య ఇంటికి సమీపంలోనే ఉన్న వలవోజుల బాబయ్య అనే మరో వ్యక్తికి చెందిన మూడు సంవత్సరాల వయసు కలిగిన మేకపోతును దొంగలు అపహరించుకుపోయినట్లు వివరించారు. గుర్తుతెలియని దొంగలు అపహరించిన మేకల విలువ సుమారు 70వేల రూపాయలు ఉంటుందని స్థానికులు పేర్కొన్నారు. తమ మేకలు దొంగతనానికి గురైనట్లు గుర్తించిన బాధిత కుటుంబీకులు అదే గ్రామానికి చెందిన నవతెలంగాణ రిపోర్టర్ చాట్ల యాదగిరి ద్వారా మంగళవారం ఉదయం మాడ్గుల పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకొని వివరాలు సేకరించినట్లు తెలిపారు. కాగా ఈ విషయమై పోలీసులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



కేశంపేట, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 07): కేశంపేట మండలం పాపిరెడ్డిగూడలో పరిధిలోని గుట్టలగడ్డతండాలో మంగళవారం అనారోగ్యంతో మృతి చెందిన ముడావత్ లచ్చానాయక్ కుటుంబానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో పాటు దాతలు ఆర్థిక సహాయం అందజేశారు. మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే రూ.5 వేలు, మాజీ జడ్పిటిసి తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి రూ.5 వేలు, మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి రూ.5 వేలు అర్థిక సహాయం అందజేసా సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చెవెళ్ల నర్సింలు, అబ్బి సుందరయ్యలతో పాటు తండావాసులు పాల్గొన్నారు.

కొండారెడ్డిపల్లిలో

మండలంలోని కొండారెడ్డిపల్లిలో అనారోగ్యంతో మృతి చెందిన కర్నెకోట యాదోజీ కుటుంబానికి దాతలు ఆర్థిక సహాయం అందజేశారు. మృతుని కుటుంబానికి మాజీ జడ్పిటిసి పల్లె నర్సింగ్‌రావు రూ.5 వేలు, బీఆర్ఎస్ నాయకుడు కానం ప్రేమ్‌కుమార్‌గౌడ్ రూ.5 వేలు అందజేసి సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, బందులాల్, నరేష్, సత్యంగౌడ్, శ్రీకాంత్, సురేష్‌లు పాల్గొన్నారు.

## కేశంపేటలో 5 మంది బైండోవర్



కేశంపేట, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 07): కేశంపేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన మందిని మంగళవారం సిఐ నరహరి ఆదేశాల మేరకు పోలీసులు తాసీల్దార్ రాజేందర్‌రెడ్డి ముందు బైండోవర్ చేశారు. కొత్తపేటకు చెందిన దానగల్ల భానుచందర్, కేశంపేటకు చెందిన లిక్కి జంగయ్య, కె.మహేష్, సిరిగిరి ఎల్లస్వామి, నిర్దవెల్లికి చెందిన కమ్మరి నరసింహ్మాచారిలను తాసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. రాబోయే ఎన్నికల్లో ఎలాంటి నేరాలకు పాల్పడిన ఒక్కొక్కరికి ఒక లక్ష రూపాయలతో పాటు కఠిన చర్యలు తప్పవని, సత్ప్రవర్థనతో మెలగాలని తాసీల్దార్ రాజేందర్‌రెడ్డి హెచ్చరించారు.

# గంజాయి రవాణా బృందం అరెస్ట్

- "ఒడిశా నుండి హైదరాబాద్‌కు గంజాయి తరలింపు.. ఇద్దరు అరెస్ట్"

- " బాలాపూర్ పోలీసులు రూ.1 లక్ష విలువైన గంజాయి స్వాధీనం"



బాలాపూర్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 07): అక్రమ మత్తు పదార్థాల రవాణాపై నిఘా పెంచిన బాలాపూర్ పోలీసులు మరోసారి విజయాన్ని సాధించారు. ఒడిశా రాష్ట్రం నుండి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను పట్టుకుని, 4.04 కిలోల గంజాయి, ఒక మోటార్ సైకిల్, స్మార్ట్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే..బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్టోబర్ 7వ తేదీ మధ్యాహ్నం 4 గంటల సమయంలో పోలీసులు శివాజీ చౌక్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా వస్తున్న హోండా డియో బైక్ (నంబర్ టీ ఎస్ 07 కె డి 8147) ను ఆపి పరిశీలించగా, గంజాయి ప్యాకెట్లు దొరికాయి.అరెస్టైన నిందితులు బీసా కొమిరి అండ్ చింటూ (19), కూలీ, రోషన్‌దొల, సరోర్నగర్ మండలం నివాసి. కొక్కిలిగడ్డ ఆహారున్ అండ్ అరణ్ (20) ప్రైవేట్ ఉద్యోగి, రోషన్‌దొల, బాలాపూర్ మండలం పేర్కొన్నారు.మరొక నిందితుడు అర్జున్ (ఒడిశా రాష్ట్రం నాగులూరు) పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.నిందితులు ఒడిశా రాష్ట్రం నుండి గంజాయి తెచ్చి, హైదరాబాద్‌లో విక్రయించి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ అక్రమ వ్యాపారం సాగిస్తున్నట్లు విచారణలో ఒప్పుకున్నారని బాలాపూర్ పోలీసులు పేర్కొన్నారు. సీజ్ చేసిన వస్తువులు 3 ప్యాకెట్లలో పొడి గంజాయి 4.04 కిలోలు మార్కెట్ విలువ సుమారు రూ.1,01,000 చెప్పిన అంచనా తెలిపారు. హోండా డియో బైక్ (టీ ఎస్ 07 కె డి 8147),సామ్‌సంగ్ స్మార్ట్‌ఫోన్,సబ్ ఇన్స్పెక్టర్ ఎస్. కొటేశ్వర్ రావు నేతృత్వంలో పోలీసు బృందం నిందితులను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశారు.గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయంపై కఠిన చర్యలు కొనసాగుతాయి. యువత భవిష్యత్తును నాశనం చేసే ఈ వ్యాపారం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించం, అని బాలాపూర్ పోలీస్ స్టేషన్ సీ ఐ ఎం సుధాకర్ హెచ్చరించారు.

## శంషాబాద్ మున్సిపల్ సమీక్ష సమావేశం





శంషాబాద్యం, మేజర్ న్యూస్ (అక్టోబర్ 07) : శంషాబాద్ పురపాలక సంఘ కార్యాలయ కౌన్సిల్ హాలు యందు కమీషనర్ సుమన్ రావ్ ఆద్వర్యంలో అన్ని విభాగాల అధికారుల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ వార్డులలో పారిశుద్ధ్య పనులు నిర్వాహణ, ట్రేడ్ లైసెన్స్, జనన, మరణ ధృవీకరణ పత్రల జారీ, ఎల్.ఆర్.ఎస్ , భవన నిర్మాణ అనుమతులు, అక్రమ నిర్మాణల పై చర్యలు, అడ్వర్ టైస్మెంట్, పన్నుల వసూలు కోర్టు కేసులు, నూతన సంఘాల ఏర్పాటు, వివిధ లక్ష్యాల సాదన, స్ట్రీట్ వెండర్స్ జోన్స్ విధానం, భువన్ జీయో ట్యాగ్గింగ్, ప్రాపర్టీ టాక్స్ కలెక్షన్స్, అన్-అస్సెస్డ్, అండర్ అస్సెస్డ్ పన్ను విధింపు, ఇంజినీరింగ్ విభాగంలో వివిధ వార్డులలో అభివృద్ధి పనుల పురోగతి, నూతన పనులు చేపట్టుట, వీధి దీపాల నిర్వాహణ, రిపైర్స్, వన మహోత్సవం నందు టార్గెట్ ప్రకారము మొక్కలు నాటుట మరియు సంరక్షణ పై సమీక్షించారు.

# సరూర్ నగర్ సర్కిల్ 5లో అక్రమ నిర్మాణాలు

## అక్రమ నిర్మాణాలకు అడ్డగా కొత్తపేట్ డివిజన్







సరూర్ నగర్, మేజర్ న్యూస్ : ఎన్నో ఏళ్లుగా జి హెచ్ ఎమ్ సి అధికారులతో దోస్తీ చేసుకున్న బిల్డర్లు, జోనల్ కమిషనర్ ఆదేశాలను పక్కనపెట్టి అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు సాగిస్తున్నారు. చైన్ మెన్లు ఆపై అధికారులు చేతులు తడిపి ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. ఈ క్రమంలోనే సరూర్ నగర్ సర్కిల్ 5 పరిధిలోని ఆర్.కె పురం డివిజన్ ఓ బిల్డర్ స్టిల్ టు అనుమతులు తీసుకొని ఏకంగా రెండు అంతస్తులు అదనపు నిర్మాణం నిర్మిస్తున్నారు. ఇంతగా బిల్డర్ బరితెగించేందుకు కారణం కొంతమంది సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కారణమని ఆరోపణలు ఉన్నాయి. వారి అండతోనే బిల్డర్ అలాగే గృహ నిర్మాణ దారులు అనుమతులకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్నారు లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నట్టు విమర్శలు వస్తున్నాయి. ఇలాంటి వాటిపై ఎంతమంది ఫిర్యాదులు చేసిన సరూర్ నగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం అవుతుంది. సెక్షన్ అధికారుల నుంచి డిసి వరకు ఈ అక్రమ నిర్మాణల వెనుక లక్షలు చేతులు మారినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అక్రమ నిర్మాణాలు చేపడుతూ ఎల్బీనగర్ జోనల్ పరిధిలోని బిల్డర్లు రెచ్చిపోతున్నారు. సరూర్ నగర్ సర్కిల్ అధికారుల కళ్ళుగప్పి అనుమతులకు విరుద్ధంగా నాలుగు అంతస్తుల భవనాలను నిర్మిస్తున్నారు. అక్రమ నిర్మాణాలను ఏమాత్రం ఉపేక్షించబోమని జోనల్ కమిషనర్ పాటిల్ హేమంత్ కేశవ్ హెచ్చరించిన, జోనల్ కమిషనర్ ఆదేశాలు మాత్రం క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు.

జోనల్ కమిషనర్ చర్యలు తీసుకోవాల్సిందే..

అక్రమ నిర్మాణాల పై ఉక్కు పాదం మోపే అధికారిగా ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పేరుంది. ఆ అధికారికి తెలియకుండా బిల్డర్లు ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నారు. సరూర్ నగర్ సర్కిల్ అధికారులను తమ గుప్పెట్లో పెట్టుకొని అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నారు. బిల్డర్ల తీరును ఇదేంటని ప్రశ్నిస్తే మీకు దిక్కున చోట ఫిర్యాదు చేసుకోండి ఎవరు వస్తారు చూస్తాం అనేలా వ్యవహరిస్తున్నారు. అంతేకాదు ప్రస్తుతం కొత్తపేట్ డివిజన్ లో మోహన్ నగర్ బస్ స్టాప్ దగ్గరలో విశాల్ మార్ట్ దగ్గరలో నిర్మిస్తున్న నిర్మాణదారులు అనుమతులు తీసుకున్నది ఒకలా అయితే నిర్మాణం మరోలా చేపడుతున్నారు. నాగోల్ నుంచి ఉప్పల్ వెళ్లే ప్రధాన రహదారి గల్లి లో ఒక పేరొందిన కన్వెన్షన్ ముందర అనుమతులు రెండు నిర్మాణం ఒకటి నిర్మిస్తున్న అక్రమ భవనం అంతేకాకుండా ఆదణపు ఫ్లోర్ కూడ నిర్మిస్తున్న నిర్మాణదారుడు తనకు టౌన్ ప్లానింగ్ అధికారులు అంతా తెలుసునని ఎవరేం చేసిన తనకు ఏమీ అవ్వదని ఫిర్యాదుదారులతో బహటంగా చెప్పడం అనుమానాలకు తావిస్తోంది. వీటన్నిటిపై జోనల్ కమిషనర్ దృష్టి సాదించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## లార్డ్స్ పూర్వ విద్యార్థిని సుప్రియకు ఉచిత వైద్య సీటు

"నీట్‌లో ప్రతిభ చాటిన విద్యార్థినిని లార్డ్స్ యాజమాన్యం సన్మానం"



బాలాపూర్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 07): బడంగ్ పేట్‌లోని లార్డ్స్ పాఠశాలలో విద్య నభ్యసించిన పూర్వ విద్యార్థిని దోనాదుల సుప్రియ నీట్ పరీక్షల్లో విశిష్ట ప్రతిభ కనబరచి ఉచిత వైద్య సీటు సాధించింది. 2020-2021 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన సుప్రియ, కృషి, క్రమశిక్షణతో వైద్య విద్యలో అడుగు పెట్టడం గర్వకారణమని లార్డ్స్ వైస్ చైర్మన్ బైర్ల శ్రీనివాస్ రెడ్డి తోపాటు యాజమాన్యం అభినందించే సన్మానించారు.ఈ సందర్భంగా లార్డ్స్ ఛైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ ఛైర్మన్ బెర్లు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... "సుప్రియ చిన్ననాటి నుంచే చదువులో అద్భుత ప్రతిభ చూపేది. లార్డ్స్ పాఠశాల అందించిన బలమైన విద్యా పునాది, విలువల ఆధారిత శిక్షణ ఈ విజయానికి మూలం" అని అన్నారు.విజయాన్ని పురస్కరించుకుని లార్డ్స్ యాజమాన్యం సుప్రియ ను ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లార్డ్స్ డైరెక్టర్ సిద్దాల శ్రీలత, డీన్ సతీష్ తదితరులు పాల్గొన్నారు. సుప్రియ సాధన లార్డ్స్ విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని లార్డ్స్ గ్రూప్ ఆఫ్ సంస్థ నిర్వాహకులు తెలిపారు.

## సిజెఐ గవాయి మీద దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం - పంది జయరాజ్



యాచారం, మేజర్ న్యూస్ (అక్టోబర్ 7 ): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయి మీద జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం అని వైయస్సార్ పార్టీ జిల్లా యువసేన అధ్యక్షుడు పంది జయరాజ్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం మేజర్ న్యూస్ తో జయరాజ్ మాట్లాడుతూ.. సోమవారం సుప్రీం కోర్టు లో జరిగిన సంఘటన భారత రాజ్యాంగం మీద దాడి అని, అత్యున్నత న్యాయస్థానంలో అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తి మీద దాడి అంటే మన దేశంలో ఏ స్థాయిలో మను వాదం, సనాతన ధర్మం రూపు దిద్దుకుంటుందో ఊహించలేమన్నారు. ఎన్నో కలలు కని భారత దేశాన్ని గొప్ప గా తీర్చి దిద్దాలన్న మహానుభావుల ఆలోచనలు, కొంతమంది కుల, మత, జాతి అహంతో సర్వనాశనం చేస్తున్నారని ఆరోపించారు. సనాతన ధర్మం పేరు మీద రాకేష్ కిషోర్ అనే లాయర్ చేసిన ఇలాంటి అహంకార పూరిత దాడిని తీవ్రంగా ఖండించారు. మనువాద మత్తు తలకెక్కి, తాను ఒక న్యాయవాది అని మరిచి ప్రధాన న్యాయమూర్తి దళితుడు అనే చిన్న చూపే బూటు విసిరేంత వరకు వచ్చిందని ఆగ్రహించారు. ఈ చర్య ను తీవ్రంగా ఖండిస్తూ నిందితుడిని కఠినంగా శిక్షించేలా భారత ప్రభుత్వం చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి చర్యలకు ఎవరైనా సాహసిస్తే పరిణామాలు తీవ్రంగా ఉండేలా శిక్ష విధించాలన్నారు.

## సుప్రీంకోర్టులో సోమవారం జరిగిన అమానుష ఘటనను తీవ్రంగా ఖండించిన తెలంగాణ న్యాయశాఖ ఉద్యోగుల సంఘం



హైదరాబాద్, మేజర్‌న్యూస్: కోర్టు విచారణ జరుగుతున్న సమయంలో, ఒక వ్యక్తి భారత గౌరవనీయ ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేసిన ఈ ఘటన న్యాయవ్యవస్థ గౌరవానికి విరుద్ధమైనదిగా, అంగీకారయోగ్యం కానిదిగా సంఘం స్తుంది. ఈ సందర్భంగా ఎస్.వి. సుబ్బయ్య, రాష్ట్ర అధ్యక్షులుబీ ఆర్.ఉదయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిబీ నరేష్ యాదవ్, అసోసియేట్ అధ్యక్షుడు కె.అనిత, ఉపాధ్యక్షురాలు రాకేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీబీ మనీష్, సంధ్య, సుధా, స్వప్న, జయలక్ష్మి, స్నిగ్ధ, హుమారా సుల్తానా, సూర్యప్రకాశ్ తదితర నిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.ఇందులో అందరూ ఈ సంఘటనపై తమ ఆవేదనను వ్యక్తం చేసి, గట్టి ఖండన వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థ గౌరవం, భద్రతను కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అని సంఘం ప్రజలకు విజ్ఞప్తి చేస్తోంది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు అందరూ చైతన్యంగా వ్యవహరించాలని కోరుతోంది.